# మనజనప్రగతి

జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక

సంపుటి : 6 సంచిక : 177 పేజీలు : 8 వెల : రూ.2/- గురువారం 23 జులై 2026 వైఎస్సార్ కడప

Circulated by Kadapa, Ananthapur, Chittor, Vishakapatanam, Srikakulam, Elluru, Thirupathi, Ongole, Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool


# నీట్‌పై చర్చకు సిద్ధం..

## రాజకీయాలు చేయొద్దు: కేంద్రం

**విద్యార్థుల అంశంపై రాజకీయాలు వద్దని నడ్డా సూచన**

**ఎన్డీయేతర రాష్ట్రాల్లోనూ పేపర్ లీకులు జరిగాయన్న మంత్రి**

**ప్రతిపక్షాలు పార్లమెంట్‌లో చర్చకు రావాలని పిలుపు**

**సోనమ్ వాంగ్‌చుక్ దీక్ష విరమించాలని కోరిన నడ్డా**

**ప్రధాన్ రాజీనామాపై సభలోనే చర్చించాలని సూచన**

**న్యూఢిల్లీ,మన జనప్రగతి జూలై 22:** నీట్ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారం, విద్యార్థుల ఆందోళనలపై పార్లమెంట్‌లో సుదీర్ఘ చర్చకు కేంద్ర ప్రభుత్వం పూర్తిగా సిద్ధంగా ఉందని కేంద్ర ఆరోగ్య మంత్రి జేపీ నడ్డా స్పష్టం చేశారు. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన ఈ అంశాన్ని రాజకీయ లబ్ధి కోసం ఉపయోగించొద్దని ప్రతిపక్షాలు, ముఖ్యంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి సూచించారు.బుధవారం మీడియాతో మాట్లాడిన నడ్డా.. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని ప్రభుత్వం నీట్ అంశాన్ని

మిగతా 2లో.



# పదేళ్లలో 152 పేపర్ లీక్ కేసులు

**ఒక్క దాంటలో కూడా దోషులను తేల్చలేదు**

**ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందే**

**ప్రధాని మోడీ క్షమాపణలు చెప్పాల్సిందే**

**మీడియా సమావేశంలో రాహుల్ గాంధీ డిమాండ్**



2లో.

# ధర్మేంద్ర ప్రధాన్‌ను బర్తరఫ్ చేయండి

**: ప్రధాని మోదీకి సీఎం రేవంత్ రెడ్డి డిమాండ్**

**యువత హక్కుల కోసం కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టీకరణ**

**ధర్మేంద్రను తొలగించకుంటే మోదీ రాజీనామా చేయాలన్న ముఖ్యమంత్రి**



**కొడంగల్ మన జనప్రగతి జూలై 22:** నీట్ పేపర్ లీకేజీ వివాదంపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను తక్షణమే పదవి నుంచి బర్తరఫ్ చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ విషయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. యువత హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ తన పోరాటాన్ని నిరంతరం కొనసాగిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ధర్మేంద్ర ప్రధాన్‌ను బాధ్యతల నుంచి తొలగించలేకపోతే, ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన పదవికి రాజీనామా చేయాలని రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. మోదీని గద్దె దించి రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేసేందుకు తన నియోజకవర్గం నుంచే ప్రతిన బూనుతున్నానని ఆయన వెల్లడించారు.

మిగతా 2లో.

# భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవానికి రండి

**ప్రధాని మోడీని ఆహ్వానించిన సిఎం చంద్రబాబు**

**సుమారు 30 నిముషాల పాటు వివిధ అంశాలపై చర్చ**

**పలువురు కేంద్రమంత్రులతోనూ బాబు వరుస భేటీలు**

**గోదావరి, కావేరీ అనుసంధానంపై పాటిల్‌తో చర్చలు**

**న్యూఢిల్లీ,మన జనప్రగతి జూలై 22:** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆగస్టు 1న భోగాపురం విమానాశ్రయం ప్రారంభోత్సవానికి రావాల్సిందిగా ప్రధానిని ఆహ్వానించారు. ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవానికి వచ్చేందుకు ప్రధాని మోదీ అంగీకరించినట్లు తెలుస్తోంది. సుమారు 30 నిమిషాలకు పైగా చంద్రబాబు, మోదీ ముఖాముఖీ భేటీ అయ్యారు. దేశ, రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై ఇరువురి మధ్య సుదీర్ఘ చర్చలు

మిగతా 2లో.



# నీతి ఆయోగ్ సీఈవోగా అనురాగ్ జైన్ నియామకం

**రెండేళ్లపాటు సీఈవోగా బాధ్యతలు నిర్వహణ**

**1989 బ్యాచ్ మధ్యప్రదేశ్ క్యాడర్ ఐఏఎస్ అధికారి**

**కేంద్రం, రాష్ట్రాల్లో నాలుగు దశాబ్దాల పరిపాలనా అనుభవం**

**విధానాల రూపకల్పన, అమలులో కీలక బాధ్యతలు**

**'వికసిత్ భారత్' లక్ష్యాలకు నాయకత్వం**




2లో.




# ఏపీలో తల్లికి వందనం నిధుల విడుదల..

**రాష్ట్ర వ్యాప్తంగా 42.70 లక్షల మంది తల్లులకు లబ్ధి**

**రూ. 10,120.78 కోట్లను జమ చేయనున్న ప్రభుత్వం**

**పిల్లల చదువులు కుటుంబానికి తరగని ఆస్తి అన్న లోకేశ్**

2లో.

# అదనపు ధాన్యం కొనుగోలుకు గ్రీన్ సిగ్నల్

**తెలంగాణ రైతులకు కేంద్రం గుడ్ న్యూస్**


**8 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోళ్లకు ఆమోదం**

**సేకరించే ధాన్యం 43 లక్షల మెట్రిక్ టన్నులకు పెంపు**

**ప్రధాని మోదీకి కృతజ్ఞత తెలిపిన కేంద్రమంత్రులు**

**న్యూఢిల్లీ,మన జనప్రగతి జూలై 22:** తెలంగాణ రైతులకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. రాష్ట్రంలో అదనపు పరిమాణంలో వరి ధాన్యాన్ని సేకరించేందుకు కేంద్రం ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. రబీ సీజన్‌కు సంబంధించి

మిగతా 2లో.



# "మా సమయం వృథా చేయొద్దు"

**: విద్యార్థుల నిరసనపై పిటిషన్‌ను తిరస్కరించిన సుప్రీం**

**విద్యార్థుల నిరసనపై పోలీసుల చర్యను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్**

**తక్షణ విచారణకు నిరాకరించిన సుప్రీంకోర్టు ధర్మాసనం**

**న్యూఢిల్లీ,మన జనప్రగతి జూలై 22:** జాతీయ స్థాయి పరీక్షల్లో అవకతవకలపై విద్యార్థులు చేపట్టిన 'చలో సంసద్' నిరసన సందర్భంగా పోలీసుల చర్యను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై తక్షణ విచారణ చేపట్టేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. పిటిషనర్ తరఫు న్యాయవాది ఈ అంశాన్ని ప్రస్తావించగా, "మా సమయం వృథా చేయొద్దు" అంటూ భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్

మిగతా 2లో.



# మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు అరెస్ట్..

**కుమారుడి ప్రమాద కేసులో కుట్ర ఆరోపణలు**

**నివాసం నుంచి పోలీస్ స్టేషన్‌కు తరలింపు**

**కమరో వ్యక్తిని కేసులో ఇరికించేందుకు ప్రయత్నించారని అభియోగం**



**శ్రీకాకుళం మన జనప్రగతి జూలై 22:** శ్రీకాకుళం జిల్లా పలాసకు చెందిన వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజును పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ జీఎంఈ కాలనీలోని ఆయన నివాసానికి వెళ్లిన పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ విషయం తెలుసుకున్న పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ఆయన ఇంటి వద్దకు చేరుకోవడంతో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

మిగతా 2లో.

# మొద్దునిద్ర పోతున్న ప్రభుత్వాన్ని తట్టి లేపాల్సిందే

## పొగాకు రైతులను పట్టించుకోని బాబు

**మద్దతు ధరలు దక్కక పోవడంతో రైతులకు నష్టం**

**మా ప్రభుత్వ హయాంలో 3వేల కోట్లతో మార్కెట్ ఇంటర్వెన్షన్**

**త్వరలోనే గోదావరి జిల్లాల్లో పర్యటించి సమస్యలు తెలుసుకుంటా**

**పొగాకు రైతులకు అండగా ఉంటానని వైఎస్ జగన్ హామీ**

**అమరావతి,మన జనప్రగతి జూలై 22:** ధరల సంక్షోభంతో తల్లడిల్లుతున్న పొగాకు రైతుల సమస్యలను స్వయంగా తెలుసుకునేందుకు 10 రోజుల్లో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో పర్యటించనున్నట్లు వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారు. నిద్రపోతున్న ప్రభుత్వాన్ని లేపడం సులభం. కానీ నిద్ర నటిస్తున్న చంద్రబాబు ప్రభుత్వాన్ని లేపాలంటే మరింత గట్టిగా ఒత్తిడి తీసుకురావాల్సిందే. రైతులకు శాశ్వతంగా మంచి జరగాలంటే ప్రజా ప్రభుత్వం రావాల్సిందే. అయితే అప్పటివరకు రైతుల సమస్యలను వదిలిపెట్టకుండా ప్రభుత్వంపై నిరంతరం ఒత్తిడి తీసుకొస్తాం అని అన్నారు. బుధవారం తాడేపల్లి వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో

మిగతా 2లో.



# “మా సమయం వృథా చేయొద్దు”

**మొదటిపేజీ తరువాయి**

నేతృత్వంలోని ధర్మాసనం ఘాటుగా వ్యాఖ్యానించింది. ఇవాళ ఉదయం సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ముందుకు ఈ పిటిషన్ వచ్చింది. విద్యార్థులపై పోలీసులు అమానుషంగా ప్రవర్తించారని, అందుకు సంబంధించిన వీడియో ఆధారాలు తన వద్ద ఉన్నాయని పిటిషనర్ తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. వాటిని పరిశీలించి, రేపు (గురువారం) విచారణ చేపట్టాలని అభ్యర్థించారు. దీనిపై స్పందించిన సీజేఐ.. “మేము వీడియోలు చూడాలనుకోవడం లేదు. వాటిని చూసే సమయం మాకు లేదు. మీ, మా సమయాన్ని వృథా చేయొద్దు” అని స్పష్టం చేస్తూ తక్షణ విచారణ అభ్యర్థనను తోసిపుచ్చారు.జాతీయ పరీక్షల నిర్వహణ సంస్థ (ఎన్‌టీఏ) ఆధ్వర్యంలో జరిగిన నీట్ వంటి పరీక్షల్లో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ‘కాక్రోచ్ జనతా పార్టీ’ (సీజేపీ) ఆధ్వర్యంలో విద్యార్థులు, యువత జులై 20, 21 తేదీల్లో ‘చలో సంసద్’ కార్యక్రమం చేపట్టారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల ప్రారంభం రోజున జంతర్ మంతర్ వద్ద ఈ నిరసన చేపట్టగా, అది ఉద్రిక్తంగా మారింది.

పార్లమెంట్ వైపు దూసుకెళ్లేందుకు ప్రయత్నించిన నిరసనకారులను అడ్డుకునేందుకు భద్రతా సిబ్బంది ప్రయత్నించారు. ఈ క్రమంలో ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీఛార్జ్ చేయడంతో పాటు, బాష్పవాయువు ప్రయోగించారు. ఈ ఘటనలో పలువురు విద్యార్థులు, భద్రతా సిబ్బంది గాయపడినట్లు సమాచారం. అయితే, ఆందోళనకారులు హింసాత్మకంగా, అదుపు తప్పి ప్రవర్తించారని ఢిల్లీ పోలీసులు ఆరోపించారు.

ఇదే అంశంపై దాఖలైన పిటిషన్‌ను నిన్న ఢిల్లీ హైకోర్టు కూడా అత్యవసరంగా విచారించేందుకు నిరాకరించింది. ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీకే ఉపాధ్యాయ నేతృత్వంలోని ధర్మాసనం, “ఇలాంటి అన్ని విషయాల్లోకి కోర్టును లాగొద్దు” అని వ్యాఖ్యానిస్తూ పిటిషన్‌ను తిరస్కరించింది.

ఇప్పుడు సుప్రీంకోర్టు కూడా ఇదే తరహాలో స్పందించడం చర్చనీయాంశంగా మారింది. సుప్రీంకోర్టు, ఢిల్లీ హైకోర్టు రెండూ తక్షణ విచారణకు నిరాకరించడంతో పిటిషనర్లు ఇప్పుడు సాధారణ రిజిస్ట్రీ ప్రక్రియ ద్వారా తమ పిటిషన్ ఎప్పుడు విచారణకు వస్తుందో వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

# ధర్మేంద్ర ప్రధాన్‌ను బర్తరఫ్ చేయండి

**మొదటిపేజీ తరువాయి**

బీజేపీ గాడ్సే వారసత్వానికి ప్రతీక అయితే, కాంగ్రెస్ పార్టీ మహాత్మా గాంధీ సిద్ధాంతాలను పుణికిపుచ్చుకున్న వారసత్వం కలిగిన పార్టీ అని ఆయన వ్యాఖ్యానించారు.

నరేంద్ర మోదీ, ధర్మేంద్ర ప్రధాన్ కలిసి ఈ దేశాన్ని దోచుకోవడానికి ప్రయత్నిస్తున్నారని రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంలో వారిని ఏమాత్రం విజయం సాధించనివ్వబోమని హెచ్చరించారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మల్లికార్జున ఖర్గే నాయకత్వంలో వీధుల నుంచి పార్లమెంటు వరకు పోరాటం సాగించి బీజేపీని ఓడిస్తామన్నారు. యువత భవితవ్యంతో, దేశ భవిష్యత్తుతో మోదీ చెలగాటమాడుతున్నారని ఆయన మండిపడ్డారు. నీట్ పరీక్షలో చోటుచేసుకున్న అక్రమాలపై నిరసనలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారు. కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ)తో పాటు ఇతర విపక్షాలు కూడా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతున్నాయి. ఈ పరిణామాల వల్ల విద్యార్థులు మానసికంగా, విద్యాపరంగా తీవ్రంగా నష్టపోతున్నారని రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా వ్యవస్థపై ప్రజలకు తిరిగి నమ్మకం కలిగించాలంటే తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.

ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయాలంటూ ఇప్పటికే పలు వర్గాల నుంచి డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి. పరీక్షల నిర్వహణలో లోపాలు జరిగాయని కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే అంగీకరించి, భవిష్యత్తులో సంస్కరణలు చేపడతామని ప్రకటించినప్పటికీ, విపక్షాలు మాత్రం కేంద్ర మంత్రిపై వేటు వేయాల్సిందేనని పట్టుబడుతున్నాయి.

# మొద్దునిద్ర పోతున్న ప్రభుత్వాన్ని తట్టి లేపాల్సిందే

**మొదటిపేజీ తరువాయి**

పొగాకు రైతులతో వైఎస్ జగన్ నిర్వహించిన సమావేశం ముగిసింది. ఈ సందర్భంగా పొగాకు రైతులతో నిర్వహించిన సమావేశంలో వైఎస్ జగన్ మాట్లాడుతూ.. పొగాకు రైతులకు అండగా నిలవడం నా బాధ్యత.అందుకే వచ్చే వారం లేదా పది రోజుల్లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో పర్యటిస్తానని అన్నారు. మా ప్రభుత్వ హయాంలో రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు దాదాపు రూ.3,000 కోట్లతో మార్కెట్ ఇంటర్వెన్షన్ ఫండ్‌ను ఏర్పాటు చేశాం. ఐదేళ్లలో పంటల కొనుగోళ్లు, మార్కెట్ జోక్యం కోసం రైతుల తరఫున సుమారు రూ.7,800 కోట్లు ఖర్చు చేశాం. ప్రతి రైతుభరోసా కేంద్రాన్ని వ్యవసాయ ధరల పర్యవేక్షణ కేంద్రంగా మార్చాం. ప్రతి పంటకు కనీస గిట్టుబాటు ధరలను ఆర్బీకేల్లో బోర్డులపై ప్రదర్శించాం. ధరలు కనీస స్థాయి కంటే తగ్గిన వెంటనే ఆర్బీకే వ్యవసాయ సహాయకుడు ప్రభుత్వాన్ని అప్రమత్తం చేసే వ్యవస్థను తీసుకొచ్చాం. గత ఏడాది ప్రకాశం జిల్లాలో పొగాకు రైతులను కలిసి వారి సమస్యలు తెలుసుకున్నాను. ఈసారి గోపాలపురం లేదా జంగారెడ్డిగూడెంలో రైతులను ప్రత్యక్షంగా కలిసి వారి కష్టాలు తెలుసుకుంటాను. ప్రభుత్వంపై మరింత ఒత్తిడి తీసుకొచ్చే కార్యక్రమాన్ని అక్కడి నుంచే ప్రారంభిస్తాను. ఈ పర్యటన తర్వాత కూడా ప్రభుత్వం స్పందించకపోతే కొద్దిరోజుల వ్యవధిలో కందుకూరులో మరో పర్యటన నిర్వహిస్తాను. పొగాకు రైతుల సమస్యలను రాష్ట్రవ్యాప్తంగా ప్రజల దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వం స్పందించే వరకు పోరాటాన్ని కొనసాగిస్తాను. ఏ జిల్లాలో, ఏ పంట రైతులు ఇబ్బందులు పడుతున్నా వైఎస్సార్‌సీపీ వారికి అండగా నిలుస్తుందని అన్నారు. పొగాకు వేలం ప్రారంభమై దాదాపు 94 రోజులు గడిచినా పండిన పంటలో కేవలం 16.5 శాతం మాత్రమే కొనుగోలు చేశారు. రాష్ట్రంలో సుమారు 232 మిలియన్ కిలోల పొగాకు పండితే ఇప్పటివరకు కేవలం 38 మిలియన్ కిలోలు మాత్రమే కొనుగోలు చేశారు. సాధారణంగా 100 రోజుల్లో పూర్తి కావాల్సిన కొనుగోలు ప్రక్రియలో 94 రోజులు గడిచినా ఐదో వంతు పంట కూడా కొనకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం. సెప్టెంబరులో కర్ణాటకలో వేలం ప్రారంభమైతే వ్యాపారులు అక్కడికి వెళ్లిపోయే ప్రమాదం ఉంది. అప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో మిగిలిన పంటను ఎవరు కొంటారనే భయాందోళన రైతుల్లో నెలకొందన్నారు. పొగాకు ధర రూ.200కు తగ్గకూడదని చంద్రబాబు సమీక్షలో చెప్పిన మరుసటి రోజే మార్కెట్లో ధరలు భారీగా పడిపోయాయి. పొదిలిలో రూ.179, టంగుటూరులో రూ.184, కనిగిరిలో రూ.184, కందుకూరులో రూ.186, జంగారెడ్డిగూడెంలో రూ.170, గోపాలపురంలో రూ.130కు కొనుగోలు చేశారు. చంద్రబాబు హెచ్చరించిన మరుసటి రోజే ధరలు పడిపోవడం వ్యాపారుల సిండికేట్ ఎంత బలంగా ఉందో తెలియజేస్తోంది. ’ఏదో ఒక ధరకు మా పంట కొనండి ..మమ్మల్ని బతికించండి’ అని రైతులు వేడుకోవాల్సిన దుస్థితికి చంద్రబాబు ప్రభుత్వం తీసుకొచ్చింది. కొనుగోళ్లలో నో-బిడ్లు పెట్టడం,పెద్దఎత్తున బేళ్లను తిరస్కరించడం ద్వారా రైతులను మరింత నష్టపరుస్తున్నారు. వ్యాపారుల మధ్య పోటీ పెరిగి రైతులకు మంచి ధర రావాలనే ఉద్దేశంతో టొబాకో బోర్డు ఏర్పాటైంది. కానీ చంద్రబాబు పాలనలో ఆ లక్ష్యమే పూర్తిగా దెబ్బతింది. వ్యాపారులంతా సిండికేట్‌గా ఏర్పడి ధరలు తగ్గిస్తున్నా ప్రభుత్వం ప్రేక్షకపాత్ర పోషిస్తోంది. నిబంధనలు పాటించని కంపెనీలపై ఒక్క కేసు కూడా నమోదు చేయలేదు. ఏ కంపెనీ లైసెన్సునూ సస్పెండ్ చేయలేదు. ఒక్క వ్యాపారినీ బ్లాక్‌లిస్ట్‌లో పెట్టలేదు. ఎంత పంట వేయాలో, ఎంత పరిమాణంలో కొనుగోలు చేస్తామో ముందుగా హామీ ఇచ్చిన లైసెన్సు దారులు ఇప్పుడు తమ బాధ్యతను విస్మరిస్తున్నారు. వారు ఇచ్చిన హామీ మేరకు రైతులకు నష్టం రాని ధరకు కొనుగోలు చేసేలా ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి. మార్క్‌ఫెడ్‌ను కొనుగోళ్లలోకి తీసుకొచ్చి ప్రభుత్వం రైతుల తరఫున నిలబడుతోందనే బలమైన సంకేతం ఇవ్వాలన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో దేశంలో ఎక్కడా లేనివిధంగా మార్క్‌ఫెడ్‌ను పొగాకు వేలం ఎ÷-లాట్‌ఫారంపైకి తీసుకొచ్చాం. మార్క్‌ఫెడ్ రంగప్రవేశంతో మార్కెట్లో నిజమైన పోటీ ఏర్పడి వ్యాపారుల సిండికేట్ విచ్ఛిన్నమైంది. ప్రభుత్వం రైతుల తరఫున కొనుగోళ్లకు సిద్ధంగా ఉందనే భయం వ్యాపారుల్లో ఏర్పడటంతో పొగాకు ధరలు పెరిగాయి. కానీ చంద్రబాబు ప్రభుత్వం మాత్రం మార్క్‌ఫెడ్‌ను కొనుగోళ్లలోకి రానివ్వకుండా అడ్డుకుంటోంది. దీనివల్ల వ్యాపారుల సిండికేట్‌కు మరింత బలం చేకూరుతోందన్నారు. సీఎం యాప్ కంటిన్యూయస్ మానిటరింగ్ ఆఫ్ అగ్రికల్చరల్ ప్రైసెస్ అండ్ ప్రొక్యూర్‌మెంట్ ద్వారా ధరలను నిరంతరం పర్యవేక్షించాం. ప్రతి జిల్లా జాయింట్ కలెక్టర్‌ను మార్క్‌ఫెడ్ జాయింట్ ఎండీగా నియమించి ధరలు పడిన ప్రాంతంలో వెంటనే కొనుగోళ్లు చేపట్టేలా వ్యవస్థను ఏర్పాటు చేశాం. ప్రభుత్వం వెంటనే మార్కెట్లో జోక్యం చేసుకోవడంతో పోటీ ఏర్పడి రైతులకు గిట్టుబాటు ధరలు లభించాయి. గతంలో ప్రభుత్వం రైతులకు తోడుగా ఉందనే భరోసా ఉండేది. ఇప్పుడు ప్రభుత్వం తమకు అండగా లేదనే భావన రైతుల్లో నెలకొంది. ప్రభుత్వ నిర్లక్ష్యమే దళారులు, వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి రైతులను దోచుకునే పరిస్థితికి కారణమైంది.పొగాకు రైతులకు న్యాయం జరిగే వరకు మా పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తాం’అని వైఎస్ జగన్ హెచ్చరించారు.

# పదేళ్లలో 152 పేపర్ లీక్ కేసులు

**న్యూఢిల్లీ, మన జనప్రగతి జూలై 22:**

గత 10 ఏళ్లల్లో 152 పేపర్ లీక్ ఉదంతాలు వెలుగు చూశాయని కాంగ్రెస్ నేత, లోక్‌సభలో విపక్షనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఒక్క కేసులో కూడా దోషులు ఎవరో తేలలేదని అన్నారు. నీట్ పేపర్ లీక్ ఉదంతంపై ఉద్యమిస్తున్న యువతకు మద్దతుగా రాహెల్ గాంధీ బుధవారం ఏర్పాటు చేసిన పత్రికాసమావేశంలో కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. ప్రస్తుత ప్రభుత్వ పాలనలో విద్యావ్యవస్థ మొత్తం రిగ్గింగ్ బారిన పడిందని ఆరోపించారు. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పనితీరు అసమర్థంగా, అవినీతిమయంగా ఉందని ఆరోపించారు. ఆయన రాజీనామా చేయాల్సిందేనని స్పష్టం చేశారు. ఆయన రాజీనామాకు విద్యార్థులు పట్టుబడుతున్నారని, ఇది సరైన డిమాండేనని వ్యాఖ్యానించారు. ఈ దుస్థితికి ప్రతిబింబంగా మారిన ధర్మేంద్ర ప్రధాన్ తప్పుకోవాల్సిందేనని తేల్చి చెప్పారు. గత పదేళ్లల్లో సుమారు 152 పేపర్ లీక్ ఉదంతాలు వెలుగు చూశాయి. అంటే.. సగటున వారానికి ఒక పేపర్ లీక్ జరిగింది. కోట్ల మంది విద్యార్థులపై ప్రతికూల ప్రభావం పడింది. కానీ ఒక్క కేసులో కూడా దోషులెవరో తేలలేదు. ఇలా ఎందుకు జరిగిందని విద్యార్థులు ప్రశ్నిస్తున్నారని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఒకప్పుడు దేశానికి సంపదగా ఉన్న విద్యారంగం ఎన్డీయే పాలనలో ధ్వంసమైందని రాహుల్ గాంధీ ఆరోపించారు. పేద, మధ్యతరగతి వర్గాలకు విద్య భారంగా మారిందని చెప్పారు. కోచింగ్‌పై నీట్ అభ్యర్థుల వార్షిక ఖర్చు రూ.1.32 లక్షల కోట్లని అన్నారు. ఇది విద్యారంగం వార్షిక బడ్జెట్ రూ.1.42 లక్షల కోట్లకు దాదాపు సమానమని వ్యాఖ్యానించారు.

సంపన్నుల కోసమే ఉద్దేశించిన ఈ వ్యవస్థలో పేదలకు స్థానం లేదని అన్నారు. సోమవారం నిరసనల సందర్భంగా విద్యార్థులపై లాఠీ చార్జి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రధాని మోదీ విద్యార్థులకు క్షమాపణలు చెప్పాల్సిందేనని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. విద్యార్థుల విషయంలో ఏం జరుగుతోంది. పారదర్శకమైన విద్యా వ్యవస్థ కావాలని యువత కోరుతోంది.

కానీ, ఈ ప్రభుత్వం శాంతియుతంగా నిరసనలు చేస్తున్న వారిపై లాఠీఛార్జ్ చేయించింది. మధ్యతరగతి కుటుంబాలకు చదువు ఆర్థిక భారంగా మారింది. విద్యపై రూ.1.4లక్షల కోట్ల బడ్జెట్‌ను కేటాయించినట్లు కేంద్రం చెబుతోంది. కానీ, గత దశాబ్ద కాలంలో దేశవ్యాప్తంగా 152 పరీక్షల పత్రాలు లీక్ అయ్యాయి. దీని వల్ల 7.50కోట్ల మంది విద్యార్థులు నష్టపోయారు. విద్యార్థులు ఎంత బాధపడుతున్నా.. ఈ ప్రభుత్వం లెక్కచేయట్లేదు. ఈ పేపర్ లీకేజీ ఘటనల్లో ఇప్పటివరకు శిక్షపడిన నేరస్థుల సంఖ్య సున్నా అని రాహుల్ విమర్శించారు. దేశ యువతకు ఉద్యోగాలు లేవు. విద్యార్థుల ఆశలు, ఆకాంక్షలను ఈ ప్రభుత్వం నాశనం చేస్తోంది. మన దేశంలో చైనా వస్తువుల సంఖ్య పెరిగింది. పరిశ్రమలు మూతపడుతున్నాయి. బ్యాంకులను బడా వ్యాపారులు లూటీ చేస్తున్నారు. ఏఐ వల్ల కార్పొరేట్ రంగంలో ఉద్యోగాలు పోతున్నాయి. కేంద్రం విధానాల వల్ల పేదలు, విద్యార్థులు నష్టపోతున్నారు. విద్యార్థులంటే మనకు శత్రువులు కాదు.

ఈ దేశ భవిష్యత్తు అన్న విషయం కేంద్రం గుర్తుంచుకోవాలని మండిపడ్డారు. విద్యాశాఖ మంత్రిగా ధర్మేంద ప్రధాన్ పూర్తిగా విఫలమయ్యారు. లీకేజీకి బాధ్యత వహిస్తూ ఆయన రాజీనామా చేయాలని యువత డిమాండ్ చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం నుంచి జవాబుదారీతనాన్ని యువత కోరుకుంటోంది. ఆందోళన చేస్తోన్న యువతపై దాడి చేసిన వారికి శిక్ష పడాలని కోరుతోంది. ఇక, ఈ వైఫల్యాలకు గానూ ప్రధాని క్షమాపణలు చెప్పాలని వారు కోరుతున్నారు. విద్యార్థుల డిమాండ్లకు మేం పూర్తి మద్దతు ప్రకటించాం అని రాహుల్ వెల్లడించారు.

# భోగాపురం రండి

**మొదటిపేజీ తరువాయి**



జరిగినట్లు సమాచారం. ఈరోజు(బుధవారం) చంద్రబాబుతో పాటు కేంద్రమంత్రులు రామ్మోహన్ నాయుడు, శ్రీనివాసవర్మ, ఎంపీలు లావు శ్రీకృష్ణ దేవరాయలు, కలిశెట్టి అప్పలనాయుడు కూడా ప్రధానిని కలిశారు. ప్రధానితో చంద్రబాబు భేటీ సందర్భంగా ఆసక్తికర సన్నివేశం జరిగింది. టీడీపీ ఎంపీ అప్పలనాయుడిని భోగాపురం విమానాశ్రయం ఉన్న స్థానిక ఎంపీ అంటూ ప్రధాని మోదీకి ఆత్మీయంగా పరిచయం చేశారు. అప్పలనాయుడు నాకు తెలుసు... ఆయన ప్రతిరోజూ సైకిల్‌పై పార్లమెంటుకు వస్తున్నారు’ అంటూ ఎంపీని ప్రధాని అభినందించారు. చంద్రబాబు నాయుడు ఢిల్లీ పర్యటనలో బిజీబిజీగా ఉన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో భేటీ అనంతరం పలువురు కేంద్ర మంత్రులతో వరుస సమావేశాలు నిర్వహించారు. ప్రధానితో భేటీ అనంతరం కేంద్ర మంత్రి పీయుష్ గోయల్‌తో సీఎం చంద్రబాబు భేటీ అయ్యారు. సుమారు 50 నిమిషాలు పాటు జరిగిన సమావేశంలో ఏపీకి కొత్త పారిశ్రామిక ప్రాజెక్టులు, పొగాకు, ఆక్వా రైతుల సమస్యలపై చర్చించినట్లు తెలుస్తోంది. ఆపై కేంద్ర పట్టణాభివృద్ధి, గృహ నిర్మాణ శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశమయ్యారు.ఇందులో భాగంగా కేంద్ర జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో ముఖ్యమంత్రి భేటీ అయ్యారు. గోదావరి - కావేరీ నదుల అనుసంధానంపై కీలక చర్చలు జరిగినట్లు తెలుస్తోంది. గోదావరి - కావేరీ అనుసంధానంపై భాగస్వామ్య రాష్ట్రాల సీఎంలతో సమావేశం ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రిని సీఎం విజ్ఞప్తి చేశారు. శ్రీశైలం నుంచి కావేరీ అనుసంధానం కన్నా బనకచర్ల నుంచి కావేరీ అనుసంధానం మంచిదని కేంద్ర జల్‌శక్తి శాఖ సూచించినట్లు తెలుస్తోంది. దేశ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని జల్‌శక్తి శాఖ.. అన్ని రాష్ట్రాలు భాగస్వామ్య పక్షాలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని చంద్రబాబు కోరారు. సముద్రంలోకి నీరు పోవడం కంటే.. ఉపయోగంలోకి వస్తే బాగుంటుందని కేంద్ర జల్‌శక్తి మంత్రికి సీఎం సూచించారు. అన్ని రాష్ట్రాలను ఒప్పిస్తే కేంద్ర ప్రతిపాదనతో తనకు అభ్యంతరం లేదని.. అందుకోసం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని చంద్రబాబు కోరగా.. ఇందుకు కేంద్ర జల్‌శక్తి శాఖ అంగీకరించినట్లు తెలుస్తోంది.

# అదనపు ధాన్యం కొనుగోలుకు గ్రీన్ సిగ్నల్

**మొదటిపేజీ తరువాయి**

అదనంగా మరో 8 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు కేంద్రం ఆమోదం తెలిపింది. సవరించిన అంచనాల ప్రకారం, మొత్తం సేకరణ పరిమితిని 35 లక్షల మెట్రిక్ టన్నుల నుంచి 43 లక్షల మెట్రిక్ టన్నులకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది.ధాన్యం కొనుగోలు కోటాను పెంచినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషికి కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి, బండి సంజయ్ కృతజ్ఞతలు తెలిపారు. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయంతో రాష్ట్రంలో ధాన్యం సేకరణ ప్రక్రియ మరింత సులభతరం కానుంది. దీనివల్ల రైతులకు గిట్టుబాటు ధర లభించడమే కాకుండా, ధాన్యం నిల్వ, రవాణా పరంగా ఎదురయ్యే సవాళ్లు కూడా తగ్గుతాయని అధికారులు భావిస్తున్నారు.వరి ఉత్పత్తిలో దేశంలోనే తెలంగాణ కీలక రాష్ట్రాల్లో ఒకటిగా ఉంది. కేంద్రం నుంచి ఇలాంటి సానుకూల నిర్ణయం వెలువడటం వల్ల మార్కెట్లు స్థిరంగా ఉండే అవకాశం ఉంది. ఫలితంగా రైతులు ఆందోళనతో తమ పంటను తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన పరిస్థితి తలెత్తదు. ప్రస్తుత సీజన్‌లో రైతులకు మేలు చేకూర్చే లక్ష్యంతో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ ఏజెన్సీలు సమన్వయంతో పనిచేస్తున్నాయి. అదనపు ధాన్యం సేకరణ ప్రక్రియ, గడువు తదితర అంశాలపై త్వరలోనే పూర్తిస్థాయి స్పష్టత రానుంది.

# నీతి ఆయోగ్ సీఈవోగా అనురాగ్ జైన్ నియామకం

**న్యూఢిల్లీ, మన జనప్రగతి జూలై 22:**

సీనియర్ ఐఏఎస్ అధికారి అనురాగ్ జైన్‌ను నీతి ఆయోగ్ కొత్త ముఖ్య కార్యనిర్వాహక అధికారి (సీఈవో)గా కేంద్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు కేంద్ర మంత్రివర్గ నియామకాల కమిటీ (ఏసీసీ) ఆమోదం తెలిపింది. ఆయన రెండేళ్లపాటు లేదా తదుపరి ఆదేశాలు వెలువడే వరకు ఈ బాధ్యతలు నిర్వహించనున్నారు. 1989 బ్యాచ్‌కు చెందిన మధ్యప్రదేశ్ క్యాడర్ ఐఏఎస్ అధికారి అయిన అనురాగ్ జైన్‌కు దాదాపు నాలుగు దశాబ్దాల పరిపాలనా అనుభవం ఉంది. కేంద్ర, మధ్యప్రదేశ్ ప్రభుత్వాల్లో పలు కీలక పదవులు నిర్వహించిన ఆయన మౌలిక సదుపాయాల అభివృద్ధి, పారిశ్రామిక విధానాలు, పెట్టుబడుల ప్రోత్సాహం, పరిపాలనా సంస్కరణల అమలులో విశేష అనుభవాన్ని సంపాదించారు.నీతి ఆయోగ్ సీఈవోగా ఆయన కేంద్ర ప్రభుత్వ విధానాల రూపకల్పన, అమలు, రాష్ట్రాలతో సమన్వయం, దీర్ఘకాలిక అభివృద్ధి వ్యూహాల రూపకల్పనలో కీలక పాత్ర పోషించనున్నారు. అలాగే ‘వికసిత్ భారత్’ లక్ష్య సాధనకు అవసరమైన విధానాల అమలును ముందుకు తీసుకెళ్లడంతో పాటు ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, పారిశ్రామిక వృద్ధి వంటి అంశాలపై నీతి ఆయోగ్ చేపడుతున్న కార్యక్రమాలకు నాయకత్వం వహించనున్నారు.

# ఏపీలో తల్లికి వందనం నిధుల విడుదల..

**అమరావతి, మన జనప్రగతి జూలై 22:**

విద్యార్థుల భవిష్యత్తుకు భరోసానిస్తూ ఏపీలోని కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా రూపొందించిన ‘తల్లికి వందనం‘ పథకం నిధులు విడుదలయ్యాయి. ఈ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 42.70 లక్షల మంది అర్హులైన తల్లుల ఖాతాల్లో రూ.10,120.78 కోట్లను ప్రభుత్వం జమ చేస్తోంది. ప్రతి విద్యార్థి తల్లికి రూ.13,000 చొప్పున అందుతున్న ఈ నిధుల జమ ప్రక్రియ ఈ నెల 24వ తేదీ వరకు కొనసాగనుంది. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ ఎక్స్ వేదికగా స్పందిస్తూ... నూతన విద్యా సంవత్సరం ప్రారంభంలోనే ఈ ఆర్థిక సాయాన్ని అందజేయడం వల్ల విద్యార్థుల చదువులకు ఎటువంటి అవాంతరాలు ఎదురుకావని అన్నారు. పిల్లలే మన అసలైన సంపదని, వారి చదువులే కుటుంబానికి తరగని ఆస్తి అని వ్యాఖ్యానించారు. గతంలో ఉన్న ఆంక్షలను తొలగించి, ఒక ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుతుంటే అంతమందికీ ఈ పథకం ఫలాలను వేర్వేరుగా వర్తింపజేస్తున్నట్లు స్పష్టం చేశారు. ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యాభ్యాసం చేస్తున్న దాదాపు 67.47 లక్షల మంది విద్యార్థులకు దీనివల్ల ప్రయోజనం కలుగుతోందని వివరిస్తూ, పిల్లల చదువు కోసం నిరంతరం శ్రమిస్తున్న ప్రతి తల్లికీ ఆయన హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

# మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు అరెస్ట్..

**మొదటిపేజీ తరువాయి**


ఇటీవల అప్పలరాజు కుమారుడు ఆరవ్ వర్మ నడిపిన బైక్ ఢీకొనడంతో గొర్రెల కాపరి దానయ్య మృతిచెందిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ కేసులో కుమారుడిని కాపాడేందుకు అప్పలరాజు కుట్ర చేశారని పోలీసులు ఆరోపిస్తున్నారు.ప్రమాదానికి కారణమైన ఆరవ్ వర్మకు బదులుగా సిద్ధార్థ త్యాడి అనే వ్యక్తిని కేసులో ఇరికించి జైలుకు పంపే ప్రయత్నం చేశారని, బాధిత కుటుంబాన్ని ప్రలోభపెట్టారని, అలాగే ప్రమాదానికి సంబంధించిన బైక్‌ను మార్చి ఆధారాలను తారుమారు చేయాలని చూశారన్న అభియోగాలతో అప్పలరాజుపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగానే ఆయన్ను అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

# నీట్‌పై చర్చకు సిద్ధం..

**మొదటిపేజీ తరువాయి**

అత్యంత సీరియస్‌గా తీసుకుంటోందన్నారు. అయితే ప్రతిపక్షాలు విద్యార్థుల సమస్యలను రాజకీయ కోణంలో చూస్తున్నాయని విమర్శించారు. జమ్మూకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, జార్ఖండ్, తెలంగాణ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, పంజాబ్, కేరళ, కర్ణాటక వంటి ఎన్డీయేతర పాలిత రాష్ట్రాల్లో కూడా పేపర్ లీక్ ఘటనలు జరిగాయని గుర్తుచేశారు. వాటిపై ప్రతిపక్షాలు ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు.పార్లమెంట్‌లో బిజినెస్ అడ్వైజరీ కమిటీ ఎంత సమయం కేటాయించినా చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని నడ్డా తెలిపారు. పరీక్షల వ్యవస్థను మరింత పారదర్శకంగా, పటిష్ఠంగా మార్చేందుకు ప్రతిపక్షాలు నిర్మాణాత్మక సూచనలు ఇవ్వాలని కోరారు. విద్యార్థుల ప్రయోజనాల కోసం అన్ని పార్టీలు కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.సోనమ్ వాంగ్‌చుక్‌ను ఆసుపత్రిలో పరామర్శించినట్లు నడ్డా వెల్లడించారు. ఆయన దీక్ష విరమించి యువతకు సానుకూల దిశలో నాయకత్వం వహించాలని కోరినట్లు చెప్పారు. వాంగ్‌చుక్ ప్రభుత్వానికి లేఖ రాశారని, దానికి తగిన విధంగా స్పందిస్తామని తెలిపారు. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా డిమాండ్‌పై స్పందించిన నడ్డా.. అలాంటి అన్ని అంశాలపై పార్లమెంట్‌లోనే చర్చ జరగాలని అభిప్రాయపడ్డారు.

# ఎస్కే యూనివర్సిటీ అధ్యాపక నియామకాలపై సమగ్ర విచారణ జరపాలి: ఏఐఎస్ఏ



అనంతపురం, మన జనప్రగతి జూలై 22: శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం (ఎస్కే యూనివర్సిటీ)లో అసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్ పోస్టుల నియామకాల్లో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ, నియామక ప్రక్రియపై స్వతంత్ర ఉన్నతస్థాయి కమిటీతో సమగ్ర విచారణ చేపట్టాలని ఏఐఎస్ఏ (ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్) ప్రతినిధులు వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జ్యోతి కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి వేమన మాట్లాడుతూ, ఒకే విద్యార్హతలు కలిగిన అభ్యర్థులను కొన్ని విశ్వవిద్యాలయాల్లో అర్హులుగా, మరికొన్నింటిలో అనర్హులుగా ప్రకటించడం వల్ల నియామక ప్రక్రియ పారదర్శకతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. ఫిజిక్స్, పాలిమర్ సైన్స్, కెమిస్ట్రీ, ఇన్‌స్ట్రుమెంటేషన్, కామర్స్, హిస్టరీ, ఎంబీఏ తదితర విభాగాల్లో అర్హతల నిర్ణయంలో వ్యత్యాసాలు చోటుచేసుకున్నాయని ఆరోపించారు. యూజీసీ నిబంధనలకు విరుద్ధంగా అర్హతలను నిర్ధారించడం వల్ల పలువురు అభ్యర్థులు నష్టపోయారని, మొత్తం నియామక ప్రక్రియను స్వతంత్ర కమిటీతో విచారించి అక్రమాలు జరిగితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విశ్వవిద్యాలయ నియామకాల్లో పారదర్శకత, సమానత్వం, న్యాయం పాటించేలా వైస్ ఛాన్సలర్ తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఏ జిల్లా కన్వీనర్ బాలకృష్ణతో పాటు పలువురు పాల్గొన్నారు.

# రైతుల భూ సమస్యల పరిష్కారానికి చర్యలు వేగవంతం చేయాలి: జాయింట్ కలెక్టర్ మీది మీనా


### రీ-సర్వేపై సమీక్ష..స్మార్ట్ కిచెన్ నిర్మాణ పనులు, చౌకదుకాణం ఆకస్మిక తనిఖీ



సిద్ధవటం మన జనప్రగతి జూలై 23:-రైతుల భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించి చర్యలు వేగవంతం చేయాలని కడప జాయింట్ కలెక్టర్ మీది మీనా అధికారులను ఆదేశించారు. బుధవారం సిద్ధవటం తహసీల్దార్ కార్యాలయంలో లింగంపల్లి, మూలపల్లి, నేలనూతలపురం గ్రామాల రైతుల పట్టాదారు భూముల రీ-సర్వేపై సమీక్ష నిర్వహించి సంబంధిత వివరాలను తెలుసుకున్నారు. ఉద్దిమడుగు ప్రాజెక్టు పరిధిలోని రైతుల భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించి వారికి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం సిద్ధవటంలోని స్మార్ట్ కిచెన్ భవన నిర్మాణ పనులను పరిశీలించిన జాయింట్ కలెక్టర్, షాప్ నంబర్10 చౌక దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి నిర్వహణపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విజయకుమార్, డిప్యూటీ తహసీల్దార్ మాధవీలత, ఆర్ఐ ప్రసాద్, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ శాఖ ఎంపీఈఓలను రెగ్యులర్ చేసి వేతనాలు పెంచాలి

● ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్



పత్తికొండ మన జనప్రగతి జూలై 22:-వ్యవసాయ శాఖలో గత 12 సంవత్సరాలుగా ఎంపీఈఓలుగా (మండల వ్యవసాయ విస్తరణ అధికారులు) పనిచేస్తున్న సిబ్బందిని రెగ్యులర్ చేసి, వేతనాలు పెంచాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి డి. రాజా సాహెబ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం వారం రోజులుగా ఎంపీఈఓలు చేపడుతున్న ఆందోళనకు రైతు సంఘం సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో రైతుల పొలాలను పరిశీలించడం, పంటల పరిస్థితిపై ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు సమాచారం అందించడం, రైతులకు ప్రభుత్వానికి మధ్య అనుసంధానకర్తగా బాధ్యతాయుతంగా సేవలందిస్తున్న ఎంపీఈఓలకు నెలకు కేవలం రూ.12 వేల గౌరవ వేతనం మాత్రమే చెల్లించడం అన్యాయమని విమర్శించారు. పెరుగుతున్న ధరల నేపథ్యంలో ఈ వేతనం కుటుంబ పోషణకు ఏమాత్రం సరిపోవడం లేదని, పైగా గత నాలుగు నుంచి ఐదు నెలలుగా వేతనాలు కూడా పెండింగ్‌లో ఉంచడం దురదృష్టకరమన్నారు. ఎంపీఈఓలకు వెంటనే రెన్యూవల్ జీవో జారీ చేయాలని, సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా సమాన పనికి సమాన వేతనం సూత్రం ప్రకారం కనీసం రూ.36 వేల వేతనం అందించాలని కోరారు. అలాగే 12 సంవత్సరాలుగా పనిచేస్తున్న ఎంపీఈఓలను రెగ్యులర్ చేయడం, ప్రమాద బీమా, హెల్త్ కార్డులు, గ్రాట్యుటీ, మహిళా ఉద్యోగులకు చైల్డ్ కేర్ లీవులు, సి.ఎఫ్.ఎం.ఎస్. ద్వారా ప్రతి నెలా సకాలంలో వేతనాలు చెల్లించడం, నాన్-శాంక్షన్ పోస్టులను శాంక్షన్ పోస్టులుగా మార్చి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఎంపీఈఓల న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా రైతు సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని డి. రాజా సాహెబ్ హెచ్చరించారు.

# మద్దూర్ నగర్ నిరాశ్రయుల వసతి గృహాన్ని తనిఖీ చేసిన న్యాయమూర్తి.



కర్నూలు బ్యూరో మన జనప్రగతి జూలై 22:-జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి మద్దూర్ నగర్ లో గల వేదాస్ పట్టణ నిరాశ్రయుల వసతి గృహాన్ని తనిఖీ చేశారు. బుధవారం కార్యాలయాలకు సంబందించిన రిజిస్టర్ లను పరిశీలించి అక్కడి సౌకర్యాలు, పరిశుభ్రతను పరిశీలించారు. అక్కడి వారిని అడిగి వారికీ అందించే భోజన, వసతి, వైద్య సదుపాయలను గురించి తెలుసు కొని సంతృప్తి వక్తం చేసారు. వృద్ధులకు నిరాశ్రయులకు లీగల్ అవేర్నెస్ క్యాంపు నిర్వహించి ఏవైనా సమస్యలుంటే లీగల్ సర్వీసెస్ టోల్ ఫ్రీ నెంబర్ 15100కు కాల్ చేస్తే వారి చట్ట పరమైన సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ నిరాశ్రయుల వసతి గృహ లీగల్ ఎయిడ్ క్లినిక్ న్యాయవాది రాంపుల్లయ్య, వేదాస్ వసతి గృహ నిర్వాహకురాలు పరమేశ్వరి తదితరులు పాల్గొనారు.

# ఆస్పరిలో 25న సీఎం చేతుల మీదుగా 'సంజీవని' ప్రారంభం

### ముఖ్యమంత్రి పర్యటనకు విస్తృత ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి





కర్నూలు బ్యూరో మన జనప్రగతి జూలై 22:-రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'సంజీవని' కార్యక్రమాన్ని ఈ నెల 25న ఆస్పరి మండల కేంద్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించనున్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి, జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్‌తో కలిసి బుధవారం పరిశీలించారు. హెలిప్యాడ్, బహిరంగ సభా వేదిక, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పార్కింగ్, తాగునీరు, పారిశుద్ధ్యం, భద్రత, ట్రాఫిక్ ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ అధికారులకు పలు సూచనలు చేశారు. ముఖ్యమంత్రి ముందుగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వైద్య సేవలను పరిశీలించి, అనంతరం 'సంజీవని' కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. తర్వాత ప్రజావేదికలో పాల్గొని పార్టీ క్యాడర్ సమావేశానికి హాజరవుతారని వివరించారు.

ప్రభుత్వం అమలు చేస్తున్న 'సేఫ్ మదర్‌హుడ్' కార్యక్రమాన్ని కూడా ముఖ్యమంత్రి పరిశీలించి, గర్భిణులు, వారి కుటుంబ సభ్యులతో మాట్లాడనున్నట్లు కలెక్టర్ తెలిపారు. తల్లి, శిశు ఆరోగ్యం, పోషకాహారం, టీకాలు, 'షేర్డ్ పేరెంటింగ్' వంటి అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాలకు వైద్య సేవలను చేరువ చేసే 'ఆరోగ్య రథం' కార్యక్రమాన్ని కూడా ముఖ్యమంత్రి ప్రారంభించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

ఈ పరిశీలనలో పత్తికొండ ఆర్డీవో ఓబులేసు, కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కామేశ్వర ప్రసాద్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు

# అభివృద్ధి,సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ చేర్చాలి

### పులివెందుల నియోజకవర్గం టీడీపీ ఇంచార్జ్ బీటెక్ రవి

### పులివెందుల టీడీపీ విస్తృత స్థాయి సమావేశంలో 'డోర్ టు డోర్ క్యాంపెయిన్'పై నాయకులకు దిశానిర్దేశం



పులివెందుల అర్బన్ మన జనప్రగతి జులై 22: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లేందుకు ప్రతీ ఒక్క కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని టీడీపీ పులివెందుల నియోజకవర్గ ఇన్‌చార్జ్ మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి (బీటెక్ రవి) పిలుపునిచ్చారు. బుధవారం పులివెందులలోని టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి నియోజకవర్గ పరిశీలకుడు సామాకోటి ఆదినారాయణతో కలిసి బీటెక్ రవి హాజరై,పార్టీ నాయకులు మరియు కార్యకర్తలకు పలు విషయాలపై దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ ఫలాలను ప్రతి ఇంటికీ చేరవేసేందుకు ఉద్దేశించిన "డోర్ టు డోర్" ప్రచారాన్ని గ్రాండ్ సక్సెస్ చేయాలని కోరారు. ప్రతి కార్యకర్తా ప్రజలతో నేరుగా కనెక్ట్ అయి, ప్రభుత్వ పనితీరును వివరించాలని సూచించారు. బూత్ స్థాయి నుంచి పార్టీని మరింత పటిష్టం చేసేలా శ్రమించాలని పిలుపునిచ్చారు. అధిష్టానం ఇచ్చిన 45 రోజుల ప్రోగ్రామ్‌ను గ్రామ స్థాయి లీడర్లు అందరూ బాధ్యతగా అమలు చేయాలని, ప్రతి ఇంటికి వెళ్లి తల్లికి వందనం, పెంచిన పెన్షన్ల గురించి, కూటమి ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రజలతో మాట్లాడి ఫీడ్ బ్యాక్ తీసుకోవాలని సూచించారు. పార్టీ కోసం కార్యకర్తలు పడుతున్న కష్టాన్ని గుర్తించి, వారి పట్ల తాను రుణపడి ఉన్నానని కృతజ్ఞతలు తెలిపారు. పదవుల పంపకాల్లో వచ్చే అసంతృప్తి సహజమేనని, కష్టపడి పనిచేసే వారికే ప్రాధాన్యత ఉంటుందని స్పష్టం చేశారు. పార్టీ బి.ఎల్.ఏలు అద్భుతంగా పని చేసి నియోజకవర్గంలో దాదాపు 30,000 తప్పుడు ఓట్లను గుర్తించారని ప్రశంసించారు. స్థానికంగా ఉండే ఓటర్లే సరైన నిర్ణయం తీసుకుంటారని, ఓట్ల నమోదు మరియు తొలగింపు ప్రక్రియపై శ్రద్ధ వహించాలని తెలిపారు. అలాగే రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం త్వరలోనే కలెక్టర్ పులివెందులలో వరుసగా నాలుగు వారాల పాటు గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించి, పెండింగ్ లో ఉన్న సమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తారని హామీ ఇచ్చారు. అడుక్కుంటే ఏదీ రాదని, మన సత్తా మనం నిరూపించుకోవాలని క్యాడర్ కు దిశానిర్దేశం చేశారు. అక్టోబర్‌లో జరగనున్న ఎన్నికల్లో పులివెందుల మున్సిపాలిటీని గెలుచుకుంటే పదవులు, పవర్ వాటంతట అవే వస్తాయని ఉద్ఘాటించారు. ఉపాధి హామీ పథకం కింద నోటిఫైడ్ పనులతో పాటు గ్రావెల్ రోడ్లు కూడా మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. పోలీస్ డిపార్ట్మెంట్ నుండి పార్టీ క్యాడర్ కు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసుకుంటున్నామని భరోసా ఇచ్చారు. కార్యకర్తలు కష్టపడటం వల్లే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, ఈ ఐదేళ్లు దాన్ని అనుభవించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని ధైర్యం చెప్పారు. క్యాడర్ కు ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచ్, కౌన్సిలర్ వంటి పదవులు ఇప్పించి గెలిపించుకునే బాధ్యత తనదేనని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల ఇన్‌చార్జ్‌లు, ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జ్‌లు, బూత్ కమిటీ సభ్యులు మరియు భారీ సంఖ్యలో పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# సాగునీటి సమస్యలు పరిష్కరించండి:సిపిఎం



దేవనకొండ మన జన ప్రగతి జులై 22:దేవనకొండ మండలంలోని సాగునీటి సమస్యల పై దృష్టి పెట్టాలని వాటిని పరిష్కరించాలని సిపిఎం జిల్లా నాయకులు బి. వీరశేఖర్ డిమాండ్ చేశారు. బుధవారం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో స్థానిక అయ్యప్ప స్వామి గుడి దగ్గర నుండి సిపిఎం కార్యకర్తలు ర్యాలీగా బయలుదేరి బస్టాండ్ దగ్గర సాగునీటి సమస్యల పరిష్కారానికి రాస్తారోకో కార్యక్రమంలో నిర్వహించారు మండల కమిటీ సభ్యులు ముక్కెళ్ల అశోక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు బి వీరశేఖర్ మండల కమిటీ సభ్యులు యూసుఫ్ భాష, కోట కొండ సూరి లు మాట్లాడుతూ జిల్లాలో కరువు పరిష్కారంపై ఉద్దేశించబడి నిర్మాణమైన హంద్రీనీవా ప్రాజెక్టు తొలి దశలోనీ పందికొన రిజర్వాయర్ నుండి 65 వేల ఎకరాలకు సాగు నీరు ఇవ్వాలని లక్ష్యం పెట్టుకోగా అందులో దేవనకొండ మండలానికి 46 వేల ఎకరాలకు సాగుబడి ఉందని అయితే సంవత్సరాలు గడుస్తున్నా పంట కాల్వల నిర్మాణం లేక ఒక ఎకరా కూడా ప్రభుత్వం అధికారికంగా సాగునీరు ఇవ్వడం లేదని పేర్కొన్నారు. కాలువలు వెంబడి పోతున్న నీరును ఒడిసిపెట్టి మోటార్ల ద్వారా రైతులు అనేక వ్యయ ప్రయాసలకు ఓర్చి పైపుల ద్వారా నీళ్లు కట్టుకుంటున్నారని దీనివల్ల కొంతమందికే సాగునీరు దక్కుతుందని ప్రభుత్వం వెంటనే స్పందించి పంట కాల్వల నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు అదేవిధంగా హంద్రీనీవా పనులు కరివేముల తెర్నేకల్ కప్పట్రాళ్ల మధ్య పెండింగ్ లో ఉన్నాయని ప్రధాన కాల్వ పూర్తి కాలేదని వెంటనే ప్రధాన కాలువ పెండింగ్ పనులు పూర్తి చేయాలని వారు డిమాండ్ చేశారు అదేవిధంగా గుండ్లకొండ దగ్గర స్లూయిస్ ఏర్పాటు చేసి కోటకొండ మాచాపురం వరకు కాలువ తీసుకురావడం ద్వారా పదివేల ఎకరాలకు సాగునీరు ఇవ్వచ్చని పది కి పైగా గ్రామాలకు తాగునీరు అదే విధంగా ఆయా గ్రామాల కుంటలకు చెరువులకు నీళ్లు మళ్లించవచ్చని పేర్కొన్నారు కావున గుండ్లకొండ దగ్గర వెంటనే స్లూయిజ్ ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు అదేవిధంగా వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని కరువుతో నష్టపోయిన రైతన్న ఆదుకోవాలని ఎకరాకు 80 వేల నష్టం పరిహారం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు అన్ని బ్యాంకుల్లో ఉన్నటువంటి వ్యవసాయ రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మహబూబ్ బాషా ,బజారి, కెపి రాముడు, పాండురంగడు, గాజుల శ్రీనివాసులు, మహేంద్ర, కుంకనూరు శ్రీనివాసులు, అనిల్ కుమార్ ,నాగరాజు, రంగన్న, రాము ,తెర్నేకల్ సుధాకర్, నాగేంద్ర ,రవీంద్ర, బడే సాబ్, రంగడు ,మహేష్, రామారావు ,రమేష్, కోటకొండ సుధాకర్, లక్ష్మన్న మరియు ఆయా గ్రామాల రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# నీట్ పేపర్ లీకేజ్‌పై ప్రశ్నించిన విద్యార్థులపై లాఠీచార్జ్ ఖండనీయం

### కేంద్ర విద్యాశాఖ మంత్రి బాధ్యత వహించి రాజీనామా చేయాలి: ఏఐఎస్ఎఫ్,ఎస్ఎఫ్ఐ,ఏఐవైఎఫ్



ఆస్పరి మన జనప్రగతి జులై 22:-నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారంపై నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, నిరుద్యోగులపై ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద పోలీసులు లాఠీచార్జ్ చేయడాన్ని ఏఐఎస్ఎఫ్,ఎస్ఎఫ్ఐ,ఏఐవైఎఫ్ విద్యార్థియువజన సంఘాల నాయకులు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా బుధవారం ఆస్పరిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయకులు రమేష్, రవి, ఈశ్వర్ మాట్లాడుతూ నీట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలకు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నైతిక బాధ్యత వహించి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నీట్ పేపర్ లీకేజీ కారణంగా వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని, పారదర్శకమైన పరీక్షల కోసం శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై బలప్రయోగం చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని విమర్శించారు. విద్యార్థుల గొంతును లాఠీలతో అణచివేయాలనే ప్రయత్నాలను సహించబోమని హెచ్చరించారు. పేపర్ లీకేజీకి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుని విద్యార్థులకు న్యాయం చేయాలని, లేకపోతే దేశవ్యాప్తంగా విద్యార్థి ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. అలాగే ఈ నెల 24వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని విద్యార్థులు,యువజన సంఘాలకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి లక్ష్మన్న, కోశాధికారి ప్రకాష్, నాయకులు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## కోదండరామ ఆలయ నిర్మాణ హామీ అమలు చేయాలని ఎస్టీ కాలనీవాసుల విజ్ఞప్తి



**సిద్ధవటం మన జనప్రగతి జూలై 22:-**మండలంలోని లింగంపల్లి గ్రామంలోని ఎస్టీ కాలనీలో కోదండరామ ఆలయ నిర్మాణానికి గతంలో ఇచ్చిన హామీని అమలు చేయాలని కాలనీవాసులు కోరారు. బుధవారం వారు మాట్లాడుతూ, గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎన్నికల సందర్భంగా ఆలయం నిర్మిస్తామని హామీ ఇచ్చి, పునాదులు మాత్రమే వేసి పనులను నిలిపివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆలయ నిర్మాణం పూర్తి కాకపోవడంతో కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం కూటమి ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని కోదండరామ ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేసి తమ చిరకాల కోరికను నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు.

## రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ యాదవ్‌ను కలిసిన మట్లి మాజీ సర్పంచ్ నాగార్జున ఆచారి



**వీరబల్లి మన జనప్రగతి జూలై 22:-**మండలంలో ప్రస్తుతం నెలకొన్న రాజకీయ పరిస్థితుల గురించి, అధికారుల తీరు గురించి, మండల సమస్యల గురించి టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లె శ్రీనివాస్ యాదవ్ ను విజయవాడలో కలసి నట్లు వీరబల్లి మండలం, మట్లి మాజీ సర్పంచ్ సోమారపు నాగార్జునాచారి బుధవారం తెలిపారు. ఆయన మన జన ప్రగతి తో మాట్లాడుతూమండలంలో నెలకొన్న ప్రజా సమస్యలు,అభివృద్ధి పనుల అమలు,ప్రభుత్వ శాఖల పనితీరుతో పాటు ముఖ్యంగా మండలంలో టీడీపీ నీ బలోపేతం చేసే విధంగా ప్రస్తుత నాయకుల మధ్య విభేదాలను తొలగించాలని, అధిష్టానం ఏమి చెబితే అలాగే నడుచుకుంటామని తెలియజేశామనీ తెలిపారన్నారు. మండలంలో ప్రజలకు మెరుగైన పాలన అందేలా, అధికారుల పనితీరుపై సమీక్ష నిర్వహించి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆయనను కోరారనీ తెలిపారన్నారు. అందుకు ఆయన తనను అభినందించినట్లు అంతే గాకుండా ప్రజా సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకునేలా కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

## పొగాకు రైతులపై జగన్‌కు మాట్లాడే నైతిక హక్కు లేదు: మంత్రి అచ్చెన్నాయుడు




**అమరావతి,మన జనప్రగతి జూలై 22:-** పొగాకు రైతుల సంక్షేమం కోసం పనిచేసింది టీడీపీ, ప్రస్తుతం కూటమి ప్రభుత్వమేనని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. రైతులను నిర్లక్ష్యం చేసిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఇప్పుడు విమర్శించే నైతిక హక్కు లేదని విమర్శించారు.జగన్ పాలనలో పొగాకు రైతుల సమస్యలు పరిష్కారం కాలేదని, కొనుగోళ్లు కేవలం కంటితుడుపు చర్యలకే పరిమితమయ్యాయని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సుమారు లి35 మిలియన్ కిలోల హెచ్‌డీ బర్లీ పొగాకును రూ.300 కోట్లతో కొనుగోలు చేసి రైతులకు అండగా నిలిచిందనిలి తెలిపారు.ఎఫ్‌సీవీ (వర్జీనియా) పొగాకు రైతుల సమస్యను రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం దృష్టికి తీసుకెళ్లగా, కేంద్ర మంత్రి పియూష్ గోయల్ జోక్యంతో కంపెనీలు రైతుల వద్ద ఉన్న పొగాకును కొనుగోలు చేసేందుకు అంగీకరించాయని చెప్పారు.వర్జీనియా పొగాకు ధరలు తగ్గడానికి ప్రపంచ మార్కెట్ పరిస్థితులు, డిమాండ్ తగ్గుదల, యుద్ధ ప్రభావం, జీఎస్‌టీలాంటి అంశాలే కారణమని, దీనిని రాజకీయాలకు వాడుకోవద్దని మంత్రి అచ్చెన్నాయుడు సూచించారు.

## రైతులు ఆరుతడి పంటల సాగుపై దృష్టి పెట్టాలి



**చిట్వేలి మన జనప్రగతి జూలై 22:-**ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులు ఆరుతడి పంటల సాగుపై దృష్టి పెట్టాలని చిట్వేలి మండల వ్యవసాయ శాఖ అధికారి జి. సుధాకర్ సూచించారు. చిట్వేలి మండలం లోని పోళ్ళోపల్లి, దేవమాచుపల్లి గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అరటి, వేరుశనగ షాపు చేసిన వారు జూలై 24 వ తేదీ లోపల, వరి, అరటి, వేరుశనగ సాగు చేసిన వారు ఆగస్టు 15వ తేదీ లోపల పంట భీమా తప్పనిసరిగా చేసుకోవాలని సూచించారు. పంటల బీమా చేసుకున్న రైతుకి పంట నష్టం వస్తే ఇన్సూరెన్సు ద్వారా తగిన పరిహారం లభించి ఊరట కలుగుతుందని తెలిపారు. రైతులు స్వయముగా గాని, మీ సేవా ద్వారా గాని దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అలాగే ప్రతి రైతు ఏపీ ఏఐఎంఎస్ 2.0 అప్లికేషన్ తప్పనిసరిగా మొబైల్ లో ఇన్స్టాల్ చేసుకోవాలని సూచించారు. ఈ యాప్ ద్వారా రైతుల భూమి వివరాలు, వాతావరణం వివరాలు, పంట నమోదు వివరాలు, ప్రభుత్వం ద్వారా పొందిన ఎరువుల వివరాలు తెలుసుకోవచ్చని అన్నారు. పంటల సాగుకు, చీడపీడల నివారణలకు నిపుణుల సలహాలు పొందవచ్చునని తెలిపారు. ఈ - పంట ద్వారా పంట నమోదు చేసుకుంటేనే పంటకు తగిన యూరియా, డిఏపీ ఎరువులని పొందవచ్చునని తెలిపారు. పచ్చిరొట్ట ఎరువులైన జనుము, జీలగ లను, పిఎండిఎస్ కిట్స్ వేయడం ద్వారా రసాయన ఎరువులని తగ్గించి మంచి దిగుబడులు పొందవచ్చునని తెలిపారు.

## అదునాతన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ఏర్పాటు చేస్తాం: ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు




**తిరుపతి, మన జనప్రగతి జూలై 22 :-** నగరంలో మటన్, ఫిష్, కూరగాయలు ఒకే చోట లభించేలా ఆధునిక ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు.అక్కరాంపల్లి వద్ద స్మార్ట్ సిటీ కింద నిర్మాణంలో నిలిచిపోయిన కూరగాయల మార్కెట్‌ను ఇంచార్జి కమిషనర్ శారదాదేవి, అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం నగర అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించి, పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌కు అనుమతులు లభిస్తే ఆరు నెలల్లో నిర్మాణం పూర్తి చేస్తామని స్మార్ట్ సిటీ అధికారులు తెలిపారు. నగరంలో పారిశుద్ధ్య నిర్వహణ, మట్టి రోడ్ల అభివృద్ధి, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, తాగునీటి సరఫరా, అన్నా క్యాంటీన్ల నిర్వహణ, రెవెన్యూ వసూళ్లను మరింత మెరుగుపరచాలని ఎమ్మెల్యే సూచించారు.గ్రేటర్ తిరుపతి ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు, కార్పొరేషన్ ఉద్యోగులు సమయపాలన పాటిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆదేశించారు.

## రైతు సమస్యల పరిష్కారానికి కేంద్రం సానుకూలం: మంత్రి అచ్చెన్నాయుడు



**అమరావతి,మన జనప్రగతి జూలై 22:-** రాష్ట్రంలోని పొగాకు, ఆక్వా రైతుల సమస్యల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వంతో జరిగిన చర్చలు సానుకూల ఫలితాలు ఇస్తున్నాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు.మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఢిల్లీలో కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, పీయూష్ గోయల్ తదితరులతో సమావేశమై ముడి పొగాకుపై జీఎస్టీ తగ్గింపు, అదనపు ఆర్థిక సాయం, ఆక్వా ఫీడ్ ధరల నియంత్రణ అంశాలపై చర్చించామని చెప్పారు. ఈ అంశాలపై కేంద్రం సానుకూలంగా స్పందించిందని, త్వరలో రైతులకు ఊరటనిచ్చే నిర్ణయాలు వెలువడే అవకాశం ఉందన్నారు.పొగాకు రైతులకు టొబాకో బోర్డు సెస్ నిధుల నుంచి కిలోకు రూ.15 చొప్పున ఆర్థిక సాయం అందించాలని కేంద్రాన్ని కోరినట్లు తెలిపారు. అలాగే ఆక్వా రంగానికి అవసరమైన ముడి పదార్థాల లభ్యత, ఫీడ్ ధరల నియంత్రణపై కూడా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.అనంతరం వైసీపీపై విమర్శలు చేసిన మంత్రి, రైతుల సమస్యలను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవద్దని సూచించారు. రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

## శ్రీ కోదండ రామస్వామి దేవాలయ పునర్నిర్మాణానికి ఎమ్మెల్యే హామీ



**చిట్వేలి మన జనప్రగతి జూలై 22:-** చిట్వేలి మండలం మాలేమార్పురం గ్రామంలో ఎన్నో ఏళ్లుగా శిథిలావస్థలో ఉన్న పురాతన శ్రీ కోదండ రామస్వామి దేవాలయాన్ని పునర్నిర్మించాలని గ్రామ పెద్దలు టీడీపీ నాయకులు రాజుకుంట నరసింహ ను కోరారు. గ్రామ ప్రజల విజ్ఞప్తిని రైల్వే కోడూరు శాసనసభ్యులు అరవ శ్రీధర్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముక్కా రూపానంద రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే శ్రీధర్, రూపానంద రెడ్డి సతీమణి వరలక్ష్మి తో కలిసి మాలేమార్పురం గ్రామంలోని పురాతన శ్రీ కోదండ రామస్వామి దేవాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రస్తుత పరిస్థితిని పరిశీలించిన వారు ఎండోమెంట్స్ శాఖ అధికారులతో చర్చించి, దేవాలయ పునర్నిర్మాణ పనులను వీలైనంత త్వరగా ప్రారంభించి పూర్తి చేయడానికి కృషి చేస్తామని గ్రామ పెద్దలకు హామీ ఇచ్చారు. మాలేమార్పురం గ్రామ ప్రజల చిరకాల కోరిక పురాతన శ్రీ కోదండ రామస్వామి దేవాలయ పునర్నిర్మాణం త్వరలోనే కార్యరూపం దాల్చనుండటంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ పెద్దలు, మాజీ ఎంపీటీసీ శివ ప్రసాద్ రాజు, వెంకటరమణ, కొండపనేని సుబ్బారాయుడు, కట్టా శంకరయ్య, కట్టా శ్రీనివాసులు పాల్గొన్నారు.

## నిడదవోలు విజన్ యాక్షన్ ప్లాన్‌కు జాతీయ స్థాయిలో ప్రశంసలు

● 'మింట్'లో ప్రత్యేక కథనం.. హర్షం వ్యక్తం చేసిన మంత్రి కందుల దుర్గేష్



**నిడదవోలు, మన జనప్రగతి జూలై 22:-** స్వర్ణాంధ్ర2047 లక్ష్య సాధనలో భాగంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేస్తున్న నిడదవోలు నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకోవడం పట్ల రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ హర్షం వ్యక్తం చేశారు.ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి ఛైర్మన్ ఎస్. మహేంద్ర దేవ్ ప్రముఖ జాతీయ దినపత్రిక లి'మింట్'లిలో రాసిన ప్రత్యేక కథనంలో నిడదవోలు విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ పనితీరును దేశానికే ఆదర్శంగా ప్రశంసించారని మంత్రి తెలిపారు.వ్యవసాయం, విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి, మహిళా సాధికారత, మౌలిక సదుపాయాలు, డిజిటల్ సేవలు తదితర రంగాలను సమన్వయం చేస్తూ ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధిని వేగవంతం చేస్తున్న ఈ నమూనా రాష్ట్ర పాలనా సంస్కరణలకు గుర్తింపుగా నిలిచిందన్నారు. నిడదవోలు విజన్ యాక్షన్ ప్లాన్ స్పెషల్ ఆఫీసర్ ఎన్. మనోజ్ రెడ్డి, యంగ్ ప్రొఫెషనల్ జె.ఎస్. సుధీర్ కుమార్, విజన్ బృందం, అధికారులు, ప్రజాప్రతినిధులు మరియు భాగస్వాములైన అందరినీ మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. ఈ విజన్ యాక్షన్ ప్లాన్ స్వర్ణాంధ్ర2047 లక్ష్యాల సాధనలో కీలక మైలురాయిగా నిలుస్తుందని మంత్రి విశ్వాసం వ్యక్తం చేశారు.

## రాష్ట్రంలో మరిన్ని బీసీ గురుకులాలు ఏర్పాటు: మంత్రి సవిత







**శ్రీసత్యసాయి,మన జనప్రగతి జూలై 22 :-** రాష్ట్రంలో ప్రస్తుత విద్యా సంవత్సరంలో 10 కొత్త మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ గురుకుల పాఠశాలలను ప్రారంభించామని, వచ్చే విద్యా సంవత్సరంలో మరిన్ని గురుకులాలను ఏర్పాటు చేస్తామని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత తెలిపారు.శ్రీసత్యసాయి జిల్లా రామగిరి మండలం నసన్నకోట బీసీ బాలికల గురుకుల జూనియర్ కళాశాల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే పరిటాల సునీతతో కలిసి పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ, బీసీల విద్యకు కూటమి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. బీసీ హాస్టళ్లు, గురుకులాల అభివృద్ధికి భారీగా నిధులు కేటాయించి, సీసీ కెమెరాలు, ఆర్వో ప్లాంట్లు, ఇన్వర్టర్లు, దోమతెరలు, నాణ్యమైన భోజన సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు.2014లో రాష్ట్రంలో 32 బీసీ గురుకులాలు మాత్రమే ఉండగా, ప్రస్తుతం వాటి సంఖ్య గణనీయంగా పెరిగిందని, ఈ ఏడాది 10 కొత్త గురుకులాలతో పాటు ఆరు బాలికల గురుకులాలను జూనియర్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేశామని మంత్రి వెల్లడించారు. కార్పొరేట్ విద్యాసంస్థల కంటే ఎంజేపీ గురుకులాల్లో సీట్లకే అధిక డిమాండ్ ఉందన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పరిటాల సునీతతో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ట్రేడింగ్ పేరుతో కోట్ల రూపాయల మోసం

● అంతర్రాష్ట్ర ఘరానా నిందితుడు అరెస్ట్



**కడప, మన జనప్రగతి జూలై 22:-** స్టాక్ మార్కెట్, క్రిప్టో ట్రేడింగ్‌లో నెలకు 10 నుంచి 20 శాతం లాభాలు వస్తాయని నమ్మబలికి కోట్ల రూపాయలు వసూలు చేసి పెట్టుబడిదారులను మోసం చేసిన అంతర్రాష్ట్ర ఘరానా నిందితుడిని రిమ్స్ పోలీసులు అరెస్ట్ చేశారు.జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు, కడప డీఎస్పీ బాలస్వామిరెడ్డి పర్యవేక్షణలో రిమ్స్ సీఐ ఎం. రాజగోపాల్ నేతృత్వంలో పోలీసులు ప్రధాన నిందితుడు కిచ్చా వీరభద్రరావు అలియాస్ కేవీ రావు (51), హైదరాబాద్ ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.పోలీసుల వివరాల ప్రకారం, హైదరాబాద్‌లోని వి.ఆర్. ట్రేడింగ్ సర్వీసెస్ పేరుతో సంస్థ నిర్వహిస్తూ ట్రేడింగ్‌లో భారీ లాభాలు వస్తాయని చెప్పి కడపకు చెందిన బాధితుల నుంచి భారీ మొత్తాలు వసూలు చేశారు. ప్రారంభంలో కొంత లాభం చెల్లించి నమ్మకం కల్పించి, అనంతరం డబ్బులు తిరిగి ఇవ్వకుండా మోసం చేసినట్లు విచారణలో తేలింది. కడపకు చెందిన ఇద్దరు మహిళల నుంచి సుమారు రూ.65 లక్షలు వసూలు చేసినట్లు పోలీసులు తెలిపారు.విచారణలో నిందితుడు ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ, హర్యానా రాష్ట్రాల్లో కూడా ఇదే తరహా మోసాలకు పాల్పడినట్లు, వివిధ రాష్ట్రాల్లో సుమారు లరూ.15 కోట్ల మేర పెట్టుబడులు సేకరించి పలువురిని మోసం చేసినట్లు వెల్లడైంది. ఈ కేసులతో పాటు నిందితుడిపై తెలంగాణ, హర్యానా రాష్ట్రాల్లో ఇప్పటికే పలు క్రిమినల్ కేసులు నమోదై ఉన్నాయని పోలీసులు తెలిపారు.అధిక లాభాల పేరుతో పెట్టుబడులు కోరే వ్యక్తులు, సంస్థలను నమ్మే ముందు పూర్తి వివరాలు ధృవీకరించాలని, మోసాలకు గురైతే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని జిల్లా పోలీసులు ప్రజలకు సూచించారు.

## నగ్న సత్యం రెడ్ బుక్' చిత్రానికి మంత్రి కొల్లు రవీంద్ర క్లాప్



**విజయవాడ మన జనప్రగతి జూలై 22 :-** యథార్థ రాజకీయ సంఘటనల ఆధారంగా రూపొందుతున్న నగ్న సత్యం రెడ్ బుక్' చిత్రాన్ని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర క్లాప్ కొట్టి ప్రారంభించారు.ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు వెంకటరమణ పసుపులేటి మాట్లాడుతూ, గత, వర్తమాన రాజకీయ పరిణామాలు, రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సమస్యలు, సంక్షేమ పథకాలు, శాంతి భద్రతలు, ప్రజల అభిప్రాయాలు వంటి అంశాలను వాస్తవ సంఘటనల ఆధారంగా చిత్రంలో ఆవిష్కరిస్తున్నామని తెలిపారు.రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలతో పాటు ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లే ఉద్దేశంతో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నామని చెప్పారు. చిత్రీకరణకు కొంతమంది ప్రజాప్రతినిధులు, అధికారుల నుంచి పూర్తి సహకారం లభించడం లేదని ఆయన పేర్కొన్నారు.ఈ చిత్రాన్ని ప్రారంభించిన మంత్రి కొల్లు రవీంద్రకు దర్శకుడు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

## జాతీయ రోలర్ స్కేటింగ్ పోటీల్లో గోమతి నారాయణ విద్యార్థినికి మూడు స్వర్ణ పతకాలు




**నెల్లూరు, మన జనప్రగతి జూలై 22:-** ప్రతిష్టాత్మక రోలర్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వారు నిర్వహించిన జాతీయస్థాయి స్కేటింగ్ క్రీడా పోటీలలో నగరంలోని స్థానిక గోమతి నగర్ నందు గల గోమతి నారాయణ సి బి ఎస్ ఈ స్కూలో 11వ తరగతి చదువుతున్న విద్యార్థిని ఎనమందల అద్వైక రమ్య ఏకంగా మూడు బంగారు పథకాలు సాధించి రికార్డు సృష్టించారు. ఈనెల 13 నుండి 17వ తారీకు వరకు కాకినాడ లో జరిగిన జూనియర్ గర్ల్స్ 13వ ర్యాంకింగ్ ఓపెన్ నేషనల్ స్పీడ్ స్కేటింగ్ ఛాంపియన్షిప్ 2026 పోటీలలో వివిధ సెక్షన్లలో బంగారు పథకాలు సాధించి విజయకేతనం ఎగురవేశారు. ఈ సందర్భంగా బుధవారం స్కూల్ ఆవరణలో జరిగిన విద్యార్థిని అభినందన కార్యక్రమంలో కోర్ డీన్ కేఎస్ఆర్, ఖస్త్రవి రవి వర్మ, ఆర్ ఐ అదిశేషయ్య, ప్రిన్సిపాల్ పుష్పలత, ఉపాధ్యాయులు అద్వైకను ప్రత్యేకంగా అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ తమ పాఠశాలకు చెందిన విద్యార్థిని అద్విక రమ్య జాతీయ స్థాయిలో బంగారు పతకాలు సాధించడం నెల్లూరు జిల్లాకే గర్వకారణమన్నారు. నారాయణ విద్యాసంస్థల్లో విద్యార్థులకు చదువుతోపాటు వారికి ఆసక్తి ఉన్న క్రీడా పోటీలలో ప్రత్యేక శిక్షణ అందించి ప్రోత్సహిస్తున్నామన్నారు అద్వైత ఇటువంటి పోటీలలో అంతర్జాతీయ స్థాయిలో పాల్గొని రాణించాలని వారు ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో స్కూలు ఉపాధ్యాయులు విద్యార్థిని అద్వైక తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రతిభా పురస్కారాలు అందుకున్న నారాయణ విద్యార్థులకు ఘన సత్కారం



**నెల్లూరు మన జనప్రగతి జూలై 22 :-** ఆంధ్రప్రదేశ్ ఎస్ఎస్సీ2026 పరీక్షల్లో రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబర్చి రాష్ట్ర ప్రతిభా పురస్కారాలు అందుకున్న స్టోన్‌హౌస్‌పేట్ నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులను పాఠశాల ఆవరణలో ఘనంగా సత్కరించారు. ఇటీవల నెల్లూరులో నిర్వహించిన రాష్ట్ర ప్రతిభా పురస్కారాల కార్యక్రమంలో మంత్రి పొంగూరు నారాయణ, జిల్లా కలెక్టర్ హిమాంశు శుక్లా, జిల్లా విద్యాశాఖ అధికారి చేతుల మీదుగా విద్యార్థులు ప్రశంసాపత్రం, మెడల్‌తో పాటు ఒక్కొక్కరికి రూ.20 వేల నగదు బహుమతిని అందుకున్నారు. ఈ సందర్భంగా షేక్ షాజియా (598/600), వి. పద్మిని వినూహ్య (596/600), వై. హేమసాహిత్య (589/600) లను ప్రత్యేకంగా అభినందించారు. పాఠశాల ప్రిన్సిపాల్ పెంచల ప్రసాద్ మాట్లాడుతూ, విద్యార్థుల విజయం వారి కృషి, ఉపాధ్యాయుల అంకితభావం, తల్లిదండ్రుల సహకార ఫలితమని అన్నారు. క్లస్టర్ ప్రిన్సిపాల్ శ్రీధర్ మాట్లాడుతూ, నారాయణ విద్యాసంస్థలు విద్యార్థులను రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించేలా తీర్చిదిద్దుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ రాఘవేంద్ర, ఆర్ఐ ఆది శేషయ్య, అధ్యాపకులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొని విజేతలను శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు.

## ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ 2026 - 27 సమావేశం నిర్వహించిన భూపతి రాజు



**కాకినాడ మన జనప్రగతి జూలై 22:-**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు భూపతి రాజు ఈశ్వర్ రాజు వర్మ (సాయిబాబు రాజు ) బుధవారం 2026-27 సం నకు పౌర గ్రంథాలయ శాఖ సంచాలకుల వారు ఆమోదించిన బడ్జెట్ ను ఖర్చు చేయుటకు బడ్జెట్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రంధాలయ సంస్థ సెక్రటరీ కె జె ఎస్ ఎల్ కుమారి, ఆమోద సంఘ సభ్యులు అయిన జిల్లా విద్యాశాఖ అధికారి, జిల్లా పంచాయతీ శాఖ అధికారి, పౌర సంబంధాల శాఖ అధికారి, వయోజన విద్యాశాఖ అధికారి, తదితర శాఖల అధికారుల సమక్షంలో బడ్జెట్ ఖర్చులు వివరములు వివిధ అంశములపై ప్రతిపాదనలను పరిశీలించి ఆమోదం తెలిపారు. ఈ సమావేశంలో గ్రంధాలయ సంస్థ సంబంధించిన అధికారులు కే కిషోర్, ఎం శ్రావ్య, సాయి, వీర్రాజు, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు

## శ్రీ సత్య సంస్థ సేవలు కొనసాగించాలి: కౌడా చైర్మన్ తలాటం సత్య





**కాకినాడ మన జనప్రగతి జూలై 22:-**శ్రీ సత్య ఎడ్యుకేషన్ సర్వీస్ వెల్ఫేర్ సొసైటీ సేవలు నిరంతరం కొనసాగించి మేలు కలిగించేలా తగు చర్యలు చేపట్టాలని కౌడ చైర్మన్ తలాటం సత్య కోరారు. బుధవారం శ్రీ సత్య ఎడ్యుకేషన్ సర్వీస్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో యూకేజి నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు పర్యావరణంపై వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి సత్య ముఖ్యఅతిథిగానూ పెరిక కార్పొరేషన్ చైర్మన్ వనపర్తి బద్రి విశిష్ట అతిథిగా హాజరై విద్యార్థుల్లో విజేతలైన వారికి దృవపత్రాలు, మొక్కలను బహుకరించారు. బుధవారం సత్కళా వాహినిలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో పలు పాఠశాలకు చెందిన చిన్నారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కౌడా చైర్మన్ సత్య మాట్లాడుతూ పోటీ తత్వం బాలల్లో పెరగాలని ప్రతిభ చాలా ముఖ్యమనని ఆ దిశగా చిన్నారులకు విద్యాబోధన జరగాలని సూచించారు. ఉన్నత విలువలతో కూడిన విద్యను అభ్యసించడం ద్వారా చిన్నారులు ఉన్నత స్థితికి చేరతారని చెప్పారు. పెరిక కార్పొరేషన్ చైర్మన్ వనపర్తి బద్రి మాట్లాడుతూ విద్యకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత నిస్తోందని ప్రైవేట్ కంటే ధీటుగా ప్రభుత్వ విద్యను అందించాలని ఉపాధ్యాయులను సూచించారు. ఇదే తరహా విద్యార్థులకు కార్యక్రమాలు నిర్వహించాలని సంస్థ చైర్మన్ చెరుకూరి సాయిరాంను పలువురు కోరారు. ఈ కార్యక్రమంలో కాకినాడ రూరల్ విద్యాశాఖ అధికారి బి శ్రీనివాస కుమార్, పిఇటి అసోసియేషన్ ప్రెసిడెంట్ బి శ్రీనివాస్, వాడపల్లి దేవస్థానం డైరెక్టర్ కెవిబి శ్రీనివాస్, రిటైర్డ్ ఎస్ఎఫ్ఓ జి రాజేంద్రప్రసాద్, సంస్థ విద్యా విభాగం చైర్మన్ నందూరి ఆదిత్య కృష్ణ, ప్రాపర్టీస్ ఎండి రాఘవ, సతకళా వాహిని అధ్యక్షులు ఇవి కృష్ణమాచార్యులు, సంస్థ ఫౌండర్ ఆర్ సత్యవాణి, సభ్యులు బి మురళి, వీ ఉమాదేవి, బి నూకరాజు, బి సరోజిని, దేవుడు నాయుడు, సుబ్బారావు పాల్గొన్నారు.

## మహిళల్లో స్ఫూర్తిని నింపిన మేటి కవయిత్రి పుట్టపర్తి కనకమ్మ: ఆచార్య జి.పార్వతి

- సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో 105వ జయంతి నిర్వహణ



**కడప మన జనప్రగతి జూలై 22:-**పౌరాణిక, చారిత్రక సాహిత్యంలో నిరాదరణకు గురైన మహిళల జీవితాలను కవితా వస్తువుగా మలిచి, వారికి జరిగిన అన్యాయాన్ని తన రచనల ద్వారా సమాజానికి చాటి మహిళల్లో స్ఫూర్తిని నింపిన మేటి కవయిత్రి పుట్టపర్తి కనకమ్మ అని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి. పార్వతి పేర్కొన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో బుధవారం పుట్టపర్తి కనకమ్మ 105వ జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆచార్య జి. పార్వతి మాట్లాడుతూ కనకమ్మ పండిత కుటుంబంలో జన్మించి చిన్నతనం నుంచే సంస్కృత సాహిత్యంపై పట్టు సాధించారని, పదేళ్ల వయస్సులోనే సంస్కృత శ్లోకాలు రచించారని తెలిపారు. వివాహానంతరం ఆమె కవితా ప్రతిభను గుర్తించిన పుట్టపర్తి నారాయణాచార్యులు 'అగ్నివీణ', 'గాంధీజీ మహాప్రస్థానం' గ్రంథాలను వెలుగులోకి తీసుకువచ్చారని చెప్పారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఫ్యాకల్టీ ఆఫ్ ఎడ్యుకేషన్ డీన్ ఆచార్య పి. రమాదేవి మాట్లాడుతూ కనకమ్మకు 1975లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ఉత్తమ రచయిత్రి పురస్కారం లభించిందన్నారు. కుటుంబ బాధ్యతలతో పాటు సాహిత్య సేవను సమన్వయంతో కొనసాగించి మహిళలకు ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. సహాయ పరిశోధకులు డా. భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి, గ్రంథాలయ సహాయకులు జి. హరిభూషణరావు, రచయిత కొత్తపల్లె రామాంజనేయులు కనకమ్మ సాహిత్య సేవలను వివరించారు. పరిశోధన కేంద్రం సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

## లింగాల మండల అరటి రైతుల కష్టం అభినందనీయం: జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్




**లింగాల మన జనప్రగతి జూలై 22:-**మండల పరిధిలోని పలు గ్రామాల్లో అరటి రైతుల కష్టం, దిగుబడి అభినందనీయమని జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ అన్నారు. రాష్ట్రంలోనే గ్రామీణ మండలాలలో తలసరి ఆదాయంలో లింగాల మండలం మొదటి స్థానంలో ఉండడంతో మండల పరిధిలో ఉండే అరటి పంటను పరిశీలించి రైతులతో ముఖాముఖి మాట్లాడేందుకు బుధవారం కోమన్నూతల గ్రామంలో జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి సాధిస్తూ ఆర్థికంగా ఉన్నత శిఖరాలను అధిరోహిస్తున్న ఈ ప్రాంత రైతుల కష్టం అభినందనీయమని ఆయన అన్నారు. అరటి రైతులు గ్రూపుగా ఏర్పడి ఒక సంఘాన్ని ఏర్పాటు చేసుకొని ఆ సంఘం ద్వారా అరటి ఆకులు, మొద్దులతో వివిధ రకాల వస్తువులతో పాటు సామాగ్రిని కూడా తయారు చేసే అవకాశం ఉందన్నారు. కావున రైతులు ముందుకు వచ్చినట్లయితే బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేయించడం జరుగుతుందన్నారు. అలాగే ఇతర ప్రాంతాలకు ఇక్కడి అరటి రైతులను తీసుకువెళ్లి అక్కడ తయారైనటువంటి భోజనం చేసే ప్లేట్ల తోపాటు అరటి మొద్దులతో తయారైనటువంటి పలు రకాల వస్తువులు కూడా చూపించి వారికి ట్రైనింగు ఇప్పించడం కూడా జరుగుతుందన్నారు. కావున ఉత్సాహవంతులైన రైతులు ఒక సంఘంగా ఏర్పాటైతే పారిశ్రామికవేత్తలుగా ఎదిగే అవకాశం కూడా ఉందన్నారు. ఇందుకుగాను తమ వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా రైతులకు ఉంటాయని ఆయన హామీ ఇచ్చారు. గ్రామంలో పలు అరటి తోటలను కూడా ఉద్యానవన శాఖ అధికారులతో కలిసి పరిశీలించి రైతులకు పలు సలహాలు సూచనలు అందజేశారు. ఈసందర్భంగా రైతుల యొక్క సమస్యలు కూడా ఆయన విని పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ రవిచంద్రబాబు, డి హెచ్ ఓ హరి ప్రసాద్, మండల పరిధిలోని అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## 10 రోజుల పుట్టగొడుగుల పెంపక శిక్షణ పొందిన వారికి ధ్రువపత్రాల ప్రదానం



**రామాపురం మన జనప్రగతి జూలై 22:-** కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ సహకారంతో, రైతు సేవా సంస్థ ఆధ్వర్యంలో, నాబార్డు శివ రైతు ఉత్పత్తిదారుల సంస్థకు చెందిన 25 మంది రైతులకు రామాపురం మండలంలో నిర్వహించిన 10 రోజుల పుట్టగొడుగుల పెంపక శిక్షణా కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా రైతు సేవా సంస్థ పరిపాలకురాలు మాధవి రెడ్డి మాట్లాడుతూ, శిక్షణలో మహిళలు 90 నుంచి 100 శాతం వరకు హాజరై విశేష ఆసక్తి కనబరిచారని తెలిపారు. చిన్నపిల్లల తల్లులు, గర్భిణీ మహిళలు, యువత కూడా శిక్షణలో చురుకుగా పాల్గొనడం అభినందనీయమన్నారు. శిక్షణలో భాగంగా ఏడో, ఎనిమిదో, తొమ్మిదో రోజుల్లో ప్రకృతి వ్యవసాయ రైతు, జాతీయ అవార్డు గ్రహీత శ్రీనాథ్ రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో మూడు రోజుల పాటు ప్రత్యక్ష శిక్షణ నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయంలో తన అనుభవాలను శిక్షణార్థులతో పంచుకుని వారికి విలువైన సూచనలు అందించారు. పదో రోజు కడపలో నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన 24 మందికి నాబార్డు జిల్లా అభివృద్ధి అధికారి విజయ్ విహారి, గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ జిల్లా అధికారి హరీఫ్ చేతుల మీదుగా ధ్రువపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా విజయ్ విహారి మాట్లాడుతూ, శిక్షణలో నేర్చుకున్న నైపుణ్యాలను ఉపయోగించి పుట్టగొడుగుల పెంపకాన్ని స్వయం ఉపాధిగా చేపట్టినప్పుడే ఈ శిక్షణ సార్థకమవుతుందని అన్నారు. యూనిట్ ఏర్పాటు కోసం అవసరమైన ఆర్థిక సహాయాన్ని నిబంధనల మేరకు బ్యాంకు రుణాల ద్వారా అందించేందుకు తమవంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సమన్వయకర్త సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ ఇంటింటి ప్రచారంపై నేడు కీలక సమావేశం



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి జూలై 22:-**తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన విజయోత్సవాల సందర్భంగా చేపట్టనున్న ఇంటింటి ప్రచార కార్యక్రమంపై ప్రొద్దుటూరు నియోజకవర్గ స్థాయి కీలక సమావేశం గురువారం నిర్వహించనున్నారు. స్థానిక ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి ఆధ్వర్యంలో సాయంత్రం 4 గంటలకు కొర్రపాడు రోడ్డులోని ఎస్.కె.ఎస్.సి డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఈ సమావేశం జరగనుంది. సమావేశంలో డోర్ టు డోర్ క్యాంపెయిన్ నిర్వహణతో పాటు మై టిడిపి యాప్ ద్వారా పార్టీ కార్యక్రమాల అమలుపై కీలక సూచనలు చేయనున్నారు. ఈ సమావేశానికి తెలుగుదేశం పార్టీ క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జీలు, కూటమి ప్రభుత్వ నాయకులు, పార్టీ కార్యకర్తలు తప్పనిసరిగా హాజరుకావాలని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి కార్యాలయం ఒక ప్రకటనలో తెలియజేసింది.

## పులివెందుల వెంకటరమణ స్వామి ఆలయంలో 'విరాట పర్వ' పఠనం





**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జులై 22:** వైఎస్సార్ జిల్లా పులివెందుల పట్టణంలోని శ్రీ పద్మావతి సమేత కళ్యాణ వెంకటరమణ స్వామి ఆలయంలో బుధవారం నాటికి విరాట పర్వ పఠనం కార్యక్రమం 8వ రోజుకు చేరుకుంది. లోకకళ్యాణం, సకాలంలో వర్షాలు కురిసి సర్వజనులు సుఖసంతోషాలతో ఉండాలనే సంకల్పంతో, వరుణ దేవుని అనుగ్రహం కోసం శ్రీమద్భాగవత మరియు ధర్మ ప్రచార సమితి ఆధ్వర్యంలో ఈ బృహత్తర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ పారాయణం ప్రతిరోజూ సాయంత్రం 5:00 గంటల నుండి 6:30 గంటల వరకు జరుగుతుందని ఈ కార్యక్రమం ఆగస్టు 12 వరకు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. తాతిరెడ్డిపల్లి నివాసి వెన్నపూస నారాయణరెడ్డి పఠనశీ చేయగా, పులివెందుల నివాసి, విశ్రాంత ఉపాధ్యాయులుపాలెం లక్ష్మినారాయణవ్యాఖ్యానం చేశారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో దేవస్థాన కమిటీ, సబ్ కమిటీ సభ్యులు, శ్రీమద్భాగవత గీతా ప్రచార సమితి ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. భక్తులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

## బాలికల చదువుతోనే సమాజంలో సమానత్వం

- బేటీ బచావో..బేటీ పడావో కార్యక్రమంలో బాలికలకు అవగాహన కల్పించిన ఐసీడీఎస్ సూపర్వైజర్ హసీనా



**వేముల మన జనప్రగతి జూలై 22:-**బాలికలకు విద్యను అందించడం ద్వారా మహిళా సాధికారత సాధ్యమవుతుందని ఐసీడీఎస్ సూపర్వైజర్ హసీనా పేర్కొన్నారు. వేముల మండల పరిధిలోని స్థానిక వి. కొత్తపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల, వేముల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, ప్రభుత్వ ఎస్‌డబ్ల్యూ బాలుర వసతి గృహంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బుధవారం బేటీ బచావో.. బేటీ పడావో బాలికే భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ హసీనా మాట్లాడుతూ ఆడపిల్లల పట్ల సమాజంలో ఉన్న వివక్షను పూర్తిగా తొలగించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి బాలిక విద్యను అభ్యసించి ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగినప్పుడే కుటుంబం, సమాజం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. బాలికల విద్యకు తల్లిదండ్రులు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా బాలికలకు వారి హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, వాటిని అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. అలాగే అత్యవసర పరిస్థితుల్లో చైల్డ్ హెల్ప్ లైన్ నంబర్ 1098 ను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సంరక్షణ కార్యదర్శి వి.రోజా, ఉపాధ్యాయురాలు ఎస్. భ్రమర, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు మరియు తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గస్థాయి క్యాడర్ సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే

**ఆళ్లగడ్డ మన జనప్రగతి జూలై 22:** పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ నియోజకవర్గ స్థాయి క్యాడర్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మండల కన్వీనర్లు క్లస్టర్లు మరియు బూత్ ఇన్చార్జిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ నియోజకవర్గ స్థాయి సమస్యలు మరియు అభివృద్ధి పనుల గురించి చర్చించారు. ఈనెల 27 నుంచి జరగబోయే డోర్ టు డోర్ కార్యక్రమం గురించి క్యాడర్ తో ఎమ్మెల్యే మాట్లాడారు.



మనజనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
23- 07 - 2026

# మామిడి రైతులకు గిట్టుబాటు కరువు

**● అన్నమయ్య జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి రంగారెడ్డి**



**అన్నమయ్య జిల్లా బ్యూరో మన జనప్రగతి జులై 23:**-ప్రపంచ మామిడి దినోత్సవ సందర్భంగా తిరుపతి చిత్తూరు అన్నమయ్య జిల్లా మామిడి రైతులతో మంత్రి సన్మాన కార్యక్రమాలు చేయడం జరిగింది ఈ కార్యక్రమానికి అన్నమయ్య జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి రంగారెడ్డి హాజరు కావడం జరిగింది ఈ కార్యక్రమంలో రైతులతో ముఖాముఖి సమావేశం మాట్లాడారు ఈ కార్యక్రమంలో రైతు నాయకులు రైతులు మూడు జిల్లాల్లో నుంచి వచ్చినటువంటి అందరు కూడా ఆయనకు సన్మానం కార్యక్రమం చేశారు ఈ సమావేశంలో రంగారెడ్డి మాట్లాడుతూ ప్రపంచ మామిడి జనవసం శుభ సందర్భంగా ఈ సమావేశానికి హాజరైనటువంటి రైతులు రైతు నాయకులకు ధన్యవాదాలు తెలియజేస్తూ రైతులందరూ కూడా ఐకమత్యంగా మనకు రావలసిన వనరులన్నీ వచ్చే విధంగా అధికారులతో కానీ నాయకులతో కానీ పోరాటాలు చేసిన కూడా మనకు రావలసిన ఇన్సూరెన్స్ సబ్సిడీలు కానీ అన్నీ కూడా వచ్చే విధంగా మనము పోరాటాలు చేయాలి ప్రభుత్వాలు అయితే రైతే రాజు రాజ్యానికి వెన్నము కానీ ఎత్తుతున్నారే తప్ప రైతులకు ఏమాత్రం న్యాయం జరగలేదని ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల పైన నుంచి నష్టపోయిన మామిడి రైతును కాపాడాలి అదేవిధంగా ఖరీఫ్ సీజన్ కు కావలసిన విత్తనాలు కానీ మందులు కానీ సబ్సిడీ 90%తో ఇవ్వాలని రైతులు తీసుకున్న రుణాలను రెండు లక్షలు కాపీ చేసి వెంటనే రుణం మంజూరు చేసి రైతులను కాపాడాలని అన్నారు.ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా రాయచోటి ఏరియా అధ్యక్షుడు హరినాథ్ నాయుడు చూడు నవీన్ కుమార్ రెడ్డి మరి కొంతమంది వచ్చారు

# ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ ప్రక్రియను 100 శాతం పూర్తి చేయాలి: నీలమయ్య ఆదేశం




**చెన్నూరు మన జనప్రగతి జులై 22:**-చెన్నూరు తాసిల్దార్ కార్యాలయంలో బుధవారం ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ నీలమయ్య అధ్యక్షతన ఎస్ ఐ ఆర్ డిజిటలైజేషన్ పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించబడింది.ఈ సమావేశంలో విజయ కుమారి తహశీల్దార్ & ఏ ఈ ఆర్ ఓ బి. కిరణ్ మోహన్ రావు ఎంపిడిఓ ఏ ఈ ఆర్ ఓ తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది, ఎన్నికల సూపర్వైజర్లు మరియు మండలంలోని బిఎల్వోలు పాల్గొన్నారు.సమావేశంలో ప్రతి బి ఎల్ ఓ వద్ద ఉన్న రిజిస్టర్లు, రికార్డులు, ఇతర ఎన్నికల రికార్డులను ఆర్ ఓ శ్రీ నీలమయ్య క్షుణ్ణంగా పరిశీలించి, పెండింగ్ అంశాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి పి ఎల్ ఓ తమ పరిధిలోని రికార్డులను సక్రమంగా నిర్వహిస్తూ, డిజిటలైజేషన్ ప్రక్రియలో ఎటువంటి లోపాలు లేకుండా పూర్తి చేయాలని సూచించారు.అదేవిధంగా, ఎస్ ఐ ఆర్ డిజిటలైజేషన్ ప్రక్రియను 100 శాతం పూర్తి చేయడం అత్యంత ప్రాధాన్యతగా తీసుకోవాలని, పెండింగ్‌లో ఉన్న ప్రతి నమోదును వెంటనే పూర్తి చేసి, ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా పని చేయాలని అందరు సూపర్వైజర్లు మరియు బి.ఎల్.ఓ కు ఈ.ఆర్.ఓ ఈ ఆర్ ఓ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.సమావేశం అనంతరం అధికారులు ప్రతి బి ఎల్ ఓ వ్యక్తిగతంగా చర్చించి, అవసరమైన సూచనలు, సలహాలు అందిస్తూ ఎస్ ఐ ఆర్ డిజిటలైజేషన్‌ను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు.

# గిట్టుబాటు ధర వచ్చే వరకు రైతులు ఐక్యంగా ఉండాలి



**చిట్వేలి మన జనప్రగతి జూలై 22:**-రైల్వే కోడూరు నియోజకవర్గంలోని బొప్పాయి రైతులు గిట్టుబాటు ధర వచ్చేంతవరకు ఐక్యమత్యం గా ఉండి పోరాడాలని రైల్వే కోడూరు శాసనసభ్యులు అరవ శ్రీధర్ అన్నారు. రైల్వే కోడూరు నియోజకవర్గం లోని బొప్పాయి రైతులతో నిర్వహించిన సమావేశంలో జాయింట్ కలెక్టర్, పలు అధికారులు పాల్గొని రైతుల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బొప్పాయి రైతులకు ఎన్డీయే కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ముఖ్యంగా బొప్పాయి పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంపై తిరుపతి జిల్లా కలెక్టర్‌తో పాటు ముఖ్యమంత్రి కార్యాలయం దృష్టికి ఇప్పటికే తీసుకెళ్లినట్లు తెలిపారు. రైతులకు కిలోకు రూ.18 గిట్టుబాటు ధర కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినట్లు వెల్లడించారు.రైతులు ధర కోసం నిరసన వ్యక్తం చేస్తున్న సమయంలో కొంతమంది దళారులు లారీలను పంపించి బొప్పాయి కోతలు చేపట్టేందుకు ప్రయత్నించడం బాధాకరమని ఆయన అన్నారు. ఇప్పటికే సుమారు 20 లారీలు వెళ్లినట్లు సమాచారం ఉందని, వాటిని చెక్‌పోస్టుల వద్ద నిలిపివేసి, నిబంధనలు ఉల్లంఘించిన దళారులపై జరిమానాలతో పాటు కఠిన చర్యలు తీసుకునేలా అధికారులతో మాట్లాడతామని స్పష్టం చేశారు. రైతులు ఆర్థికంగా బలపడితేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందుతుందని, రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. రైతుల ప్రయోజనాల కోసం ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు నిరంతరం కృషి చేస్తూనే ఉంటారని ఆయన హామీ ఇచ్చారు. రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ ఆందోళన చెందవద్దని, గిట్టుబాటు ధర లభించే వరకు పంటను త్వరగా కోయకుండా రైతులంతా ఐక్యంగా నిలబడితే దళారుల దోపిడీకి అడ్డుకట్ట పడుతుందని అన్నారు. రైతుల ఐక్యతే వారి బలమని, అందరూ కలిసి ఉంటే ఎవరూ మోసం చేయలేరని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ముక్క సాయి వికాస్ రెడ్డి, అధికారులు, కూటమి నేతలు, రైతులు పాల్గొన్నారు.

# లింగాల ఐటీఐ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం




**లింగాల మన జనప్రగతి జూలై 22:**-మండల కేంద్రమైన లింగాలలో ఉన్నటువంటి ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో 202627 విద్యా సంవత్సరానికి రెండో విడత ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బుధవారం ఐటీఐ ప్రిన్సిపల్ వాసుబాబు తెలిపారు. అర్హులైన అభ్యర్థులు iti.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకుని, ఆగస్టు 3లోగా ఒరిజినల్ ధ్రువపత్రాలతో లింగాలలోని ఐటీఐ కళాశాలలో వెరిఫికేషన్ చేయించుకోవాలని ఆయన కోరారు. కళాశాలలో రెండు సంవత్సరాల ఫిట్టర్, ఎలక్ట్రికల్, సివిల్ ట్రేడ్లు, ఒక సంవత్సరం డీజిల్ మెకానిక్, కంప్యూటర్ ఆపరేటర్ (COPA) ట్రేడ్లలో సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పూర్తి సమాచారం కొరకు 9948608397, 9100843624, 9703853847 నంబర్లను సంప్రదించాలని ప్రిన్సిపల్ కోరారు.

# స్వచ్ఛ పథం కార్యక్రమం నిర్వహణ

**● ఇటుకల బట్టీలను నిబంధనల మేరకు ఏర్పాటు చేయాలని ఆదేశం**



**చెన్నూరు మన జనప్రగతి జులై 22:**-స్వచ్ఛ పథం కార్యక్రమంలో భాగంగా చెన్నూరు గ్రామపంచాయతీ పరిధిలోని ప్రభుత్వ వైద్యశాల గోసుల కళ్యాణమండపం రోడ్డు ఇరువైపులా సమీపంలో ఉన్న ఇటుకల బట్టీల వద్ద బుధవారం ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం చెన్నూరు గ్రామపంచాయతీ సిబ్బంది అధికారులు చేపట్టారుఈ సందర్భంగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి బి. కిరణ్ మోహన్ రావు ఇటుకల బట్టీలను పరిశీలించి, నిబంధనల ప్రకారం రహదారికి కనీసం 550 మీటర్ల దూరంలో మాత్రమే ఇటుకల బట్టీలను ఏర్పాటు చేసి కాల్చేందుకు అనుమతి ఉన్నప్పటికీ, కొందరు రహదారికి ఆనుకుని ఇటుకల బట్టీలు ఏర్పాటు చేయడం వల్ల దట్టమైన పొగ, దుమ్ము కారణంగా ప్రజలు తీవ్ర అసౌకర్యానికి, ఆరోగ్య సమస్యలకు గురవుతున్నారని పేర్కొన్నారు.అందువల్ల సంబంధిత యజమానులకు వెంటనే నిబంధనలు పాటిస్తూ రహదారికి 550 మీటర్ల దూరంలోనే ఇటుకల బట్టీలను ఏర్పాటు చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రజారోగ్యానికి భంగం కలిగించే విధంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో చెన్నూరు గ్రామపంచాయతీ అధికారి జగదీష్ ఎస్ఐ సుభాష్ చంద్రబోస్ , పోలీసు సిబ్బంది, గ్రామ పెద్దలు శివరాం రెడ్డి , విజయభాస్కర్ రెడ్డి పంచాయతీ కార్యాలయ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు మరియు గ్రీన్ అంబాసిడర్లు పాల్గొని స్వచ్ఛ పథం కార్యక్రమాన్ని విజయవంతం చేశారు,

# గంజాయి మత్తుతో బతుకు చిత్తు

**● మత్తుకు దూరంగా ఉండి భవిష్యత్తును నిర్మించుకోండి: జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్**





**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జులై 22:** గంజాయి వంటి మాదక ద్రవ్యాల బారిన పడితే యువత భవిష్యత్తు అంధకారమవుతుందని, మత్తు వ్యసనం వ్యక్తిగత జీవితాలను,కుటుంబాలను, సమాజాన్ని తీవ్రంగా దెబ్బతీస్తుందని జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ హెచ్చరించారు.పులివెందుల పర్యటనలో భాగంగా నిర్వహించిన మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజుతో కలిసి గంజాయి నిర్మూలన ప్రచార పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు.కలెక్టర్ మాట్లాడుతు ఇటీవల యువతలో మత్తు పదార్థాల వినియోగం పెరగడం ఆందోళనకరం విషయం అని గంజాయికి అలవాటు పడి చదువు,ఆరోగ్యం,ఉపాధి అవకాశాలను కోల్పోతున్నారన్నారు.మత్తు వల్ల నేరప్రవృత్తి, కుటుంబ కలహాలు,తీవ్ర ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని యువత తమ శక్తులను విద్య,క్రీడలు,సేవా కార్యక్రమాల వైపు మళ్లించాలని తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనను నిరంతరం గమనిస్తుండాలన్నారు.ప్రభుత్వ యంత్రాంగం, పోలీసు శాఖ, విద్యాసంస్థలు,స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేసి గంజాయిని నిర్మూలించాలన్నారు.యువత తెలుసుకోగంజాయి మత్తుతో బతుకు చిత్తు అవుతుంది.మత్తుకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన భవిష్యత్తును నిర్మించుకోండి అని జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్‌పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు మాట్లాడుతూ గ్రామాలు, పాఠశాలలు,కళాశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహించి యువతను చైతన్యపరుస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి (డిఇఓ) షంషుద్దీన్,డిఆర్డిఎ పీడీ రాజ్యలక్ష్మి,ఎస్ఎస్ఎ ఎపిడి అనురాధ,మండల విద్యాశాఖ అధికారులు చంద్రశేఖర్ రావు, రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.

# మదనపల్లె పట్టణంలో తాగునీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా తక్షణ చర్యలు తీసుకోవాలి

**● క్షేత్రస్థాయిలో పర్యటించి పరిస్థితిని పరిశీలించిన జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్**



**మదనపల్లె మన జనప్రగతి జూలై 22 :** - మదనపల్లె పట్టణ ప్రజలకు ఎలాంటి తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా నిరంతరాయంగా నీటి సరఫరా జరిగేలా అన్ని చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు.పట్టణంలోని కొన్ని వార్డుల్లో తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడిన నేపథ్యంలో బుధవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్ ప్రమీల, మున్సిపల్ ఇంజనీర్లతో కలిసి జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ క్షేత్రస్థాయిలో పర్యటించి నీటి సరఫరా పరిస్థితిని పరిశీలించారు.ముందుగా రామారావు కాలనీలోని సంప్‌ను పరిశీలించారు. సంపు ద్వారా నీటి సరఫరా వ్యవస్థ గురించి అడిగి తెలుసుకున్నారు. నీటి సరఫరాను వేగవంతం చేయాలని, సంప్‌లను వేగంగా నింపేలా చర్యలు తీసుకోవాలని, అవసరమైన అగ్నిమాపక శాఖ వాహనాలను వినియోగించాలని కలెక్టర్ సూచించారు. అలాగే అదనంగా వాహనాల అవసరం ఉంటే, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ), రవాణా శాఖ అధికారులు ప్రైవేట్ వాహన యజమానులతో సమన్వయం చేసి అవసరమైన వాహనాలను మున్సిపాలిటీకి అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.అనంతరం వేంపల్లి చెరువును సందర్శించిన జిల్లా కలెక్టర్ చెరువులో నీటి లభ్యత, బోర్ల పరిస్థితి, నీటి సరఫరాకు చేపడుతున్న చర్యలను పరిశీలించారు. అక్కడి వేంపల్లి సంప్‌ను తనిఖీ చేసి పట్టణంలోని మొత్తం తాగునీటి సరఫరా వ్యవస్థను సమీక్షించారు.పట్టణంలో నీటి సరఫరా వ్యవస్థను పూర్తిగా సంక్రమించి, నీటి పంపిణీని స్ట్రీమ్‌లైన్ చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు.సమస్య పూర్తిగా పరిష్కారమయ్యే వరకు అధికారులు క్షేత్రస్థాయిలోనే ఉండి పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ప్రజలకు నిరంతరాయంగా, సురక్షితమైన తాగునీరు అందించేందుకు పటిష్టంగా అన్ని చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు, జ్ఞాపక శాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



# రైతు సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలి: ఎమ్మెల్యే నంద్యాల

**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి జూలై 22:**-నీటి కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ప్రభుత్వం వ్యవసాయ రంగంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి కోరారు. బుధవారం నెహ్రూ రోడ్డులోని టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నీటి లభ్యత లేక అనేక ప్రాంతాల్లో రైతులు పంటలు సాగు చేయలేకపోతున్నారని, వర్షాల కోసం ఎదురుచూస్తున్న పరిస్థితి నెలకొందని తెలిపారు. పశువులకు మేత కొరత కూడా తీవ్రంగా ఉందని, రైతులతో పాటు వ్యవసాయ కూలీలు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న 'తల్లికి వందనం' పథకం ద్వారా ఇంట్లో చదువుకుంటున్న ప్రతి విద్యార్థికి ఆర్థిక సహాయం అందించడం ప్రత్యేకత అని అన్నారు. గత వైసీపీ ప్రభుత్వం 'అమ్మ ఒడి' పథకాన్ని ఒకరికే పరిమితం చేసి ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని, 2029 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి చెందిన రాష్ట్రంగా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. వైసీపీ పాలనలో ఆర్థికంగా దెబ్బతిన్న రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గాడిలో పెడుతున్నారని అన్నారు.ఎరువులు, యూరియాను అధిక ధరలకు విక్రయిస్తున్నారనే రైతుల ఫిర్యాదులపై వ్యవసాయ శాఖ అధికారులు వెంటనే స్పందించి ధరలను నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు.ఈ సమావేశంలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు చల్లా రాజగోపాల్ యాదవ్, మాజీ కౌన్సిలర్ వంగనూరు మురళీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రామసిద్ధారెడ్డికి కన్నీటి వీడ్కోలు..

**నాగేళ్ల సాంబశివరెడ్డి, కోకటం వెంకట బైయపిరెడ్డి పరామర్శ.. మృతిపై సంతాపం.. ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థన**



**వేముల మన జనప్రగతి జూలై 22:**-వైఎస్సార్సీపీ సీనియర్ నాయకుడు నల్లచెరువుపల్లి గ్రామానికి చెందిన రామిరెడ్డి రామసిద్ధారెడ్డి మృతితో కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. అనారోగ్యంతో మంగళవారం రాత్రి మృతి చెందిన రామసిద్ధారెడ్డి కుటుంబాన్ని బుధవారం ఉదయం వైఎస్సార్సీపీ వేముల మండల కన్వీనర్ నాగేళ్ల సాంబశివరెడ్డి,జడ్పీటీసీ కోకటం వెంకట బైయపిరెడ్డి లు పరామర్శించారు.ఈ సందర్భంగా రామసిద్ధారెడ్డి పార్థివ దేహానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. రామసిద్ధారెడ్డి పార్టీ అభివృద్ధికి, ప్రజా సేవకు అంకితభావంతో పనిచేసిన నాయకుడని,ఆయన అందించిన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని నాయకులు పేర్కొన్నారు.అనంతరం కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా కల్పించారు.రామసిద్ధారెడ్డి మృతి పార్టీకి తీరని లోటని,ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# స్పోర్ట్స్ విద్యార్థులకు కిట్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

**ఆళ్లగడ్డ మన జనప్రగతి జూలై 22:** పట్టణంలోని మహాత్మ జ్యోతిర్బాపూలే పాఠశాల విద్యార్థినిలకు ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ బుధవారం స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ సమస్యలు ఎమ్మెల్యే విన్నవించారు. అందులో భాగంగా ఆడుకోవడానికి గ్రౌండ్, మునిసిపల్ వాటర్ ట్యాప్, మురుగు కాలువలు, నూతన భవనం కావాలని ఎమ్మెల్యేకు విన్నవించారు. అనంతరం ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ మాట్లాడుతూ మీకు (విద్యార్థినిలకు) అన్ని వసతులు కల్పిస్తామన్నారు. ఎవరికి ఏ ఇబ్బందులు రాకుండా చూసుకుంటామని హామీ ఇచ్చారు. పదవ తరగతిలో మంచి మార్కులు సాధించిన గురు విద్యార్థినులకు రెండుల సెంట్ల ఇంటి స్థలం ఇస్తామని హామీ ఇచ్చారు.

మనజనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
23- 07 - 2026

# కోవిడ్‌పై అప్రమత్తత అవసరం..!

**• నక్కలదిన్నె పీహెచ్‌సీ పరిధిలో ఇంటింటి జ్వరాలు,లార్వా సర్వే**



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి జూలై 22:** –జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఆదేశాల మేరకు చాపాడు మండలంలోని నక్కలదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో బుధవారం ఇంటింటి జ్వరాల సర్వే, లార్వా సర్వే నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ పి. ఓబులేసు ఆధ్వర్యంలో నక్కలదిన్నె పీహెచ్‌సీ పరిధిలోని అల్లాడుపల్లి, అయ్యవారిపల్లి, పెద్దగురువలూరు, చిన్నగురువలూరు, లక్ష్మీపేట, వెదురూరు, ఎన్. ఒబాయపల్లె సచివాలయాల పరిధిలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి జ్వరాలతో బాధపడుతున్న వారిని గుర్తించడంతో పాటు దోమల లార్వా ఉత్పత్తి కేంద్రాలను పరిశీలించి ప్రజలకు అవగాహన కల్పించారు. వెదురూరులో నిర్వహించిన 104 వైద్య శిబిరం అనంతరం డాక్టర్ పి. ఓబులేసు తూర్పు అనంతపురం గ్రామాన్ని సందర్శించి సర్వేలో పాల్గొన్నారు. ఇళ్ల వద్ద నీరు నిల్వ ఉంచిన డ్రమ్‌లు, ఇతర పాత్రలను పరిశీలించి, వీధుల్లో నిల్వ ఉన్న నీటిలో పారిశుద్ధ్య సిబ్బందితో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. ఈ సందర్భంగా డాక్టర్ పి. ఓబులేసు మాట్లాడుతూ, కోవిడ్ కేసులు నమోదవుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అయితే అనవసరంగా భయపడాల్సిన అవసరం లేదన్నారు. జ్వరం, దగ్గు, గొంతు నొప్పి, ముక్కు కారడం లేదా మూసుకుపోవడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రి లేదా నక్కలదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.రద్దీ ప్రాంతాల్లో లేదా అనారోగ్య లక్షణాలు ఉన్నప్పుడు మాస్క్ ధరించడం, సబ్బుతో తరచూ చేతులు కడుక్కోవడం లేదా శానిటైజర్ వినియోగించడం, దగ్గు లేదా తుమ్ము వచ్చినప్పుడు ముక్కు, నోటిని కప్పుకోవడం, అనారోగ్యంతో ఉన్నప్పుడు ఇతరులతో సన్నిహితంగా మెలగకుండా ఉండడం, గదుల్లో తగిన గాలి ప్రసరణ ఉండేలా చూసుకోవడం వంటి జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వృద్ధులు, గర్భిణీలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, అర్హులైన వారు కోవిడ్ టీకా, బూస్టర్ డోసులు తీసుకోవడం రక్షణకు దోహదపడుతుందని తెలిపారు.అలాగే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, నీరు నిల్వ కాకుండా చూడడం, దోమల నివారణ చర్యలు చేపట్టడం ద్వారా డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా, జపనీస్ ఎన్సెఫలైటిస్ (జేఈ), బోదకాలు వంటి వ్యాధులను కూడా నివారించవచ్చన్నారు. ఆరోగ్య విస్తరణ అధికారి ఎం. రాఘవయ్య, సూపర్వైజర్ ప్రసాద్, ఎంఎల్‌హెచ్‌పీ కీర్తి, ఏఎన్‌ఎం ఆరోగ్య మేరీ, ఆశా కార్యకర్త జయమ్మ, గ్రామస్థులు పాల్గొన్నారు.

# పంటల బీమా చెల్లింపునకు 24 వరకు గడువు

**• వ్యవసాయ అధికారి బాల గంగాధర్ రెడ్డి**



**వేంపల్లె మన జనప్రగతి జూలై 22:** –వాతావరణ ఆధారిత పంటలైన పత్తి, చీని, అరటి, వేరుశెనగ తదితర పంటలకు సంబంధించి ఖరీఫ్ సీజన్ కు బీమా ప్రీమియం చెల్లింపునకు ఈనెల 24 వరకు గడువు ఉందని, రైతులు బీమా ప్రీమియం చెల్లించి తమ పంటలను నమోదు చేసుకోవాలని వేంపల్లె మండల వ్యవసాయ అధికారి బాల గంగాధర్ రెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని అలవలపాడు, ముతుకూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫసల్ బీమా యోజన పథకం కింద 12 రకాల పంటలకు బీమా వర్తిస్తుందన్నారు. ఖరీఫ్ సీజన్ లో పిఎం ఫసల్ బీమా కింద ఎంపికైన పంటల్లో బీమా ప్రీమియం చెల్లింపునకు వరికి ఆగష్టు 15 వరకు గడువు ఉందన్నారు. రబీ సీజన్ లో వరికి డిసెంబర్ 31 వరకు గడువు ఉందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా రైతులు ఎరువులు, విత్తనాలు, క్రిమిసంహారక మందులు కొనుగోలు చేసేటప్పుడు తప్పనిసరి నగదు బిల్లు తీసుకోవాలన్నారు. ఖరీఫ్ లో సాగుచేసిన అన్ని పంటలకు ఈ –పంట నమోదు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పంటల బీమాపై రైతులకు అవగాహన..!

**• వరి,ఇతర పంటలకు వేర్వేరు గడువులు**

**• ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి**

**• మండల వ్యవసాయ అధికారి జి.పి ఒబులేసు**



**వేముల మన జనప్రగతి జూలై 22:** –పంటల బీమా ద్వారా రైతులకు ఆర్థిక భరోసా లభిస్తుందని వేముల మండల వ్యవసాయ అధికారి జి.పి.ఒబులేసు తెలిపారు. వాతావరణ ఆధారిత పంటలకు బీమా పొందేందుకు రైతులకు ఈ నెల 24వ తేదీ వరకు మాత్రమే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు.బుధవారం వేముల మండల పరిధిలోని వేముల,శేషన్నగారిపల్లి గ్రామాల్లో నిర్వహించిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో ఏ.ఓ జి.పి. ఒబులేసు పాల్గొని రైతులకు పంటల బీమాపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...వాతావరణ ఆధారిత పంటలైన ప్రత్తి,వేరుశెనగ, చీని, అరటి పంటలు సాగు చేసిన రైతులు తప్పనిసరిగా ఈ నెల 24వ తేదీలోపు సమీప మీసేవ కేంద్రాల్లో బీమా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.**ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకాన్ని వినియోగించుకోవాలి** ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద ఇతర పంటలకు ఈ నెల 31వ తేదీ వరకు,వరి పంటకు ఆగస్టు 15వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు.రైతులు గడువులోగా దరఖాస్తులు చేసుకొని పంటలకు బీమా రక్షణ పొందాలని కోరారు. ప్రకృతి వైపరీత్యాలు,వాతావరణ మార్పుల వల్ల పంట నష్టాలు సంభవించిన సమయంలో బీమా రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుందని ఏ.ఓ తెలిపారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది,ఉద్యానవన సహాయకులు నియాజుల్లా,ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# 18 నెలలుగా డిజిటల్ అసిస్టెంట్ లేక ప్రజలు,విద్యార్థులు ఇబ్బందులు

**• సీపీఐ ఆధ్వర్యంలో ఎంపీడీవోకు వినతిపత్రం**



**పత్తికొండ మన జనప్రగతి జూలై 22:** –చిన్నహుల్తి గ్రామ సచివాలయంలో గత 18 నెలలుగా డిజిటల్ అసిస్టెంట్ లేకపోవడంతో చిన్నహుల్తి, పెద్దహుల్తి గ్రామాల ప్రజలు, ముఖ్యంగా విద్యార్థులు ప్రభుత్వ సేవలు పొందడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీపీఐ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో పత్తికొండ ఎంపీడీవోకు మంగళవారం వినతిపత్రం సమర్పించారు.సీపీఐ పెద్దహుల్తి శాఖ కార్యదర్శి సిద్దు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కారుమంచి, చేతి వృత్తిదారుల సమైక్య జిల్లా కార్యదర్శి ఎం. కారన్న, రైతు సంఘం నాయకులు, ఎంపీటీసీ వీరన్న మాట్లాడుతూ డిజిటల్ అసిస్టెంట్ లేక ఆదాయ, నివాస, కుల ధ్రువీకరణ పత్రాలతో పాటు ఇతర ప్రభుత్వ సేవలు పొందేందుకు ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొన్నదన్నారు. విద్యార్థులు విద్యా సంబంధిత ధ్రువీకరణ పత్రాల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.చిన్నహుల్తి గ్రామ సచివాలయానికి శాశ్వత డిజిటల్ అసిస్టెంట్‌ను వెంటనే నియమించి రెండు గ్రామాల ప్రజలకు సకాలంలో సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.వినతిపత్రంపై స్పందించిన ఎంపీడీవో, రేపటి నుంచి చిన్నహుల్తి గ్రామ సచివాలయంలో ప్రతిరోజూ రెండు గంటల పాటు పంచాయతీ కార్యదర్శి కార్తీక్ అందుబాటులో ఉండి అవసరమైన సేవలు అందిస్తారని తెలిపారు. అలాగే డిజిటల్ అసిస్టెంట్ నియామక అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు మదన్న, వీరేష్, రవి, నరసింహులు, రైతు సంఘం నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# 2026 నేషనల్ ఫస్ట్ ఛాలెంజ్ విజేతలలో "రాజు" విద్యార్థి ప్రభంజనం



**అన్నమయ్య జిల్లా బ్యూరో మన జనప్రగతి జూలై 22:** –అన్నమయ్య జిల్లా రాయచోటి మండలం రాజు విద్యార్థి స్వామికేరి వెంకట లోకేష్ జాతీయస్థాయి లో మై పోర్టల్ ఆద్వర్యంలో నెల రోజుల పాటు నిర్వహించిన నేషనల్ ఫస్ట్ ఛాలెంజ్ ఆన్ లైన్ పోటీల్లో పాల్గొని జాతీయ స్థాయిలో 5వ స్థానం మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానాన్ని సాధించారు.ఈ సందర్భం గా రాజు విద్యా సంస్థల వ్యవస్థాపకులు చమర్తి సుబ్బరాజు , రాజు హైస్కూల్ లో ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ విద్యార్థికి అభినందనలు తేలియచేస్తూ ఈ ప్రతిష్టాత్మక పురస్కారానికి ఎంపిక కావటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ పురస్కారం వలన సంస్థ పై మరింత భాధ్యత పెరిగిందని పేర్కొన్నారు. ఈ విజయానికి విద్యార్ధి కృషి తో పాటు తల్లితండ్రుల సహకారం, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం అమూల్యమైనదని ఆయన కొనిఆడారు. భవిష్యత్తు లో మా విద్యాసంస్థల నుండి మరింతమంది మేధావులను తయారు చేస్తామన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచం లో అన్ని రకాల పోటీ పరీక్షలలో "రాజు" విద్యార్థులను ముందువరసలో నిలపటానికి కృషి చేస్తామని తెలిపారు. రాజు విద్య సంస్థలు కేవలం పాఠశాలలు మాత్రమే కాదు ఇవి విజేతలను తయారుచేసే కార్యశాలలు. "రాజు" విద్యార్థులు రాష్ట్రానికే కాదు దేశానికి ఆదర్శం గా నిలుస్తున్నారని "రాజు" విద్యాసంస్థల కార్య నిర్వాహక కార్యదర్శి చమర్తి లోకేష్ రాజు అన్నారు. నేషనల్ ఫస్ట్ ఛాలెంజ్ విజేత వెంకట లోకేష్ మాట్లాడుతూ ఈ జాతీయ స్థాయి గుర్తింపు రావటం చాలా ఆనందం గా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో భాగంగా ప్రధానోపాధ్యాయులు రమణయ్య, రఘురాం ఉమామహేశ్వరి, జి.వి.రమణ,వినోద్, సుజాత, విద్యార్థులు, ఉపాధ్యాయులు మరియు తల్లితండ్రులు పాల్గొన్నారు.

# స్వచ్ఛత కార్యక్రమాలకు ప్రజల సహకారం అవసరం

**• వేములలో పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహణ • ప్రజారోగ్య పరిరక్షణకు ముందస్తు చర్యలు • సచివాలయ సిబ్బందికి పలు సూచనలు..**


**ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంపీడీఓ ఆదేశం**





**వేముల మన జనప్రగతి జూలై 22:**– స్వచ్ఛత కార్యక్రమాలకు ప్రజల సహకారం ఎంతో అవసరమని మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) యం.శారదమ్మ తెలిపారు.వేముల గ్రామపంచాయతీ పరిధిలో స్వచ్ఛ పథం కార్యక్రమంలో భాగంగా బుధవారం ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు.గ్రామంలోని బోరు వద్ద పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దారు. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రజారోగ్య పరిరక్షణకు పరిశుభ్రతను నిరంతరం కొనసాగించాలని అధికారులు సూచించారు.ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రజారోగ్యానికి భంగం కలిగించే విధంగా వ్యవహరిస్తే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సిబ్బందిని హెచ్చరించారు. ప్రతి గ్రామంలో పరిశుభ్రత, చెత్త నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు.అనంతరం మిడిపెంట్ల గ్రామంలోని ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాన్ని ఎంపీడీఓ తనిఖీ చేసి అక్కడి ఏర్పాట్లను పరిశీలించారు. పంచాయతీ అభివృద్ధి అధికారి, పారిశుద్ధ్య కార్మికులకు ప్రతిరోజూ ఇంటింటికీ వెళ్లి తడి చెత్తను సేకరించాలని, సేకరించిన వ్యర్థాలతో వర్మీ కంపోస్ట్ తయారీ చేపట్టాలని ఆదేశించారు.చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు.మిడిపెంట్ల సచివాలయాన్ని తనిఖీ చేసిన ఎంపీడీఓ సిబ్బంది అందరూ ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని తెలిపారు.ప్రభుత్వ సేవలు ప్రజలకు సకాలంలో అందేలా బాధ్యతగా పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ అభివృద్ధి అధికారి రమంజనేయమ్మ, సచివాలయ సిబ్బంది, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొని స్వచ్ఛ పథం కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# బాలికల రక్షణకు అవగాహన.. విద్యాభివృద్ధే లక్ష్యం




**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి జూలై 22:** –జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారత అధికారి ఆదేశాల మేరకు "బేటీ బచావోబేటీ పడావో" కార్యక్రమంలో భాగంగా కొత్రపాడు, వెలవలి జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా అధికారులు బాలికల రక్షణ, విద్య ప్రాధాన్యతపై విద్యార్థులకు వివరించారు. సంబంధిత శాఖల సమన్వయంతో ప్రతి బాలికకు రక్షణ కల్పించడంతో పాటు ఉన్నత విద్యను అభ్యసించేలా ప్రోత్సహించాలని సూచించారు. అలాగే బాలల సహాయవాణి 1098, మిషన్ వాత్సల్య పథకం, బాలల హక్కులు, వారికి అందుబాటులో ఉన్న చట్టాలపై అవగాహన కల్పించారు.అంగన్వాడీ కేంద్రాలు, వన్‌స్టాప్ సెంటర్ ద్వారా అందుతున్న సేవలు, మహిళా సహాయవాణి 181 వినియోగంపై కూడా వివరించారు. సూపర్‌వైజర్లు ఈశ్వరమ్మ, బి. నాగరత్నమ్మ మాట్లాడుతూ బాలికలు సమస్యలు ఎదురైనప్పుడు నిర్భయంగా సహాయ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కొత్రపాడు జెడ్పీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయుడు సురేష్‌బాబు, వెలవలి జెడ్పీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయురాలు ఉమా మహేశ్వరమ్మ, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

# జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు వేంపల్లె విద్యార్థి ఎంపిక




**వేంపల్లె మన జనప్రగతి జులై 22:** – జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు వేంపల్లె వైఎస్ఆర్ వివేకానంద డిగ్రీ కళాశాల విద్యార్థి హరిప్రసాద్ ఎంపికయ్యారు. కళాశాలలో బీకాం ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఈ విద్యార్థి ఇటీవల రాష్ట్రస్థాయిలో జరిగిన పోటీలలో సత్తా చాటి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జమ్మూ కాశ్మీర్ రాష్ట్రంలోని తావి లో ఇండియా కౌన్సిల్ ఫర్ స్పోర్ట్స్ అండ్ ఎడ్యుకేషన్ వారు ఈ నెల 24 నుంచి 26 వరకు నిర్వహిస్తున్న జాతీయస్థాయి పోటీలు జమ్ము తావి, జమ్ము & కాశ్మీర్ లో ఈ నెల 24వ తేది నుండి 26 వ తేది వరకు జరగనున్న జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీలలో పాల్గొననున్నారు.ఈ విద్యార్థి ఎంపిక పట్ల కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కే.ఉషశ్రీ ఫిజికల్ డైరెక్టర్ తేజంద్ర హర్షం వ్యక్తం చేశారు . జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థి హరిప్రసాద్ ను కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నాగేంద్ర, అధ్యాపకులు డాక్టర్ సతీష్, రాజారెడ్డి, హరిత, హాజి యాబేగం ఇతర అధ్యాపక బృందం అభినందిం చారు. జాతీయ స్థాయిలో సదరు విద్యార్థి మంచి ప్రతిభ కనబరిచి కళాశాలకు, రాష్ట్రానికి పేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు.

# వైకాపా సీనియర్ నేత సిద్ధారెడ్డి కన్నుమూత

**పార్టీ బలోపేతానికి విశేష సేవలు అందించిన నాయకుడు**

**సిద్ధారెడ్డి మృతి వైఎస్సార్‌సీపీకి తీరని లోటు: ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి**



**వేముల మన జనప్రగతి జూలై 22:** –వేముల మండల పరిధిలోని నల్లచెరువుపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు సిద్ధారెడ్డి అనారోగ్యంతో మంగళవారం రాత్రి తుదిశ్వాస విడిచారు.ఆయన మృతి చెందిన విషయం తెలుసుకున్న కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, వైఎస్ మనోహర్ రెడ్డి, వైఎస్ మధుసూదన్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి మాట్లాడుతూ..సిద్ధారెడ్డి మృతి వైఎస్సార్‌సీపీకి తీరని లోటని పేర్కొన్నారు. పార్టీ అభివృద్ధి కోసం ఆయన చేసిన సేవలు, గ్రామస్థాయిలో పార్టీ పటిష్టతకు అందించిన సహకారం ఎప్పటికీ గుర్తుండిపోతుందని తెలిపారు. ప్రజలతో మమేకమై సేవలందించిన ఆయన నాయకత్వం అభినందనీయమని కొనియాడారు.అనంతరం మృతుడి కుటుంబ సభ్యులకు ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. సిద్ధారెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

మనజనప్రగతి
23- 07 - 2026

# మధ్యాహ్న భోజన పథకంలో జిల్లాకు కొత్త దిశ: జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి





**● త్వరలో జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు స్మార్ట్ కిచెన్ పరిధిలోకి ● పెండ్లిమర్రి, పులివెందుల మండలాల్లో స్మార్ట్ కిచెన్ల పరిశీలన ● విద్యార్థులతో కలిసి భోంచేసి నాణ్యత, సుచీ, రుచిని పరిశీలన**

**కడప,మన జనప్రగతి జూలై 22:-** జిల్లాలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దే లక్ష్యంతో స్మార్ట్ కిచెన్ వ్యవస్థను దశలవారీగా జిల్లా వ్యాప్తంగా విస్తరిస్తున్నామని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తెలిపారు. బుధవారం స్మార్ట్ కిచెన్ల పరిశీలనలో భాగంగా పెండ్లిమర్రి మండలం వెల్లటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పులివెందుల బాలురు, బాలికల జెడ్పి ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన స్మార్ట్ కిచెన్లను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకం అమలు తీరు, కిచెన్లలో ఆహార తయారీ, పరిశుభ్రత, నాణ్యత ప్రమాణాలు, రవాణా, పాఠశాలలకు భోజనం చేరవేత తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.లిలి ఈ సందర్భంగా పులివెందులలో జిల్లా కలెక్టర్ పాత్రికేయులతో మాట్లాడుతూ... గత ఏడాది కడప నగర పాలక సంస్థ పరిధిలోని రెండు మండలాల్లో ప్రయోగాత్మకంగా ప్రారంభించిన స్మార్ట్ కిచెన్లు విజయవంతం కావడంతో, ఆ అనుభవాన్ని ఆధారంగా తీసుకుని ఇప్పుడు జిల్లాలోని ప్రతి ప్రభుత్వ పాఠశాలను స్మార్ట్ కిచెన్ పరిధిలోకి తీసుకురావాలని నిర్ణయించినట్లు వెల్లడించారు.ప్రస్తుతం జిల్లాలో 20 స్మార్ట్ కిచెన్లు పూర్తిస్థాయిలో పనిచేస్తున్నాయని, వచ్చే వారంలో మరో 13 స్మార్ట్ కిచెన్లు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ప్రతి స్మార్ట్ కిచెన్ పరిధిలో దశలవారీగా మరో ఒకటి లేదా రెండు పాఠశాలలను చేర్చుతూ వ్యవస్థను విస్తరిస్తున్నామని చెప్పారు.ప్రస్తుతం రోజుకు 32 వేల మందికి పైగా విద్యార్థులకు స్మార్ట్ కిచెన్లలో తయారైన పరిశుభ్రమైన, నాణ్యమైన భోజనం అందిస్తున్నామని.. ఈ వ్యవస్థను మరింత విస్తరించి ప్రతిరోజూ లక్ష మంది విద్యార్థులకు సెంట్రల్ స్మార్ట్ కిచెన్ల ద్వారా భోజనం అందించే బృహత్తర కార్యక్రమాన్ని త్వరలోనే అమలు చేయనున్నట్లు వెల్లడించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా అత్యాధునిక సాంకేతికత, పటిష్టమైన నిర్వహణ, నాణ్యత ప్రమాణాలతో ఈ కార్యక్రమం రాష్ట్రానికే కాక దేశానికీ ఆదర్శంగా నిలుస్తుందనే ధీమాను వ్యక్తం చేశారు.పులివెందుల మండలంలో స్మార్ట్ కిచెన్ ప్రారంభించిన పది రోజులు పూర్తయిందని.. సంతృప్తి కరంగా మధ్యాహ్న భోజనం అందివ్వడం జరుగుతోందన్నారు. ప్రతిరోజూ సుమారు నాలుగు వేల మంది విద్యార్థులకు భోజనం సిద్ధం చేసి సమయానికి అందిస్తున్నామని, వడ్డించే సమయానికి ఆహారం వేడిగా, రుచికరంగా, నాణ్యంగా ఉంటుందో లేదో తెలుసుకునేందుకు తానే స్వయంగా పాఠశాలలను సందర్శించి పరిశీలిస్తున్నట్లు వివరించారు. ఆహార నాణ్యత, రుచి, ఉష్ణోగ్రత, సమయపాలన, రవాణా విధానం వంటి అంశాలను నిరంతరం పరిశీలిస్తున్నామన్నారు. స్మార్ట్ కిచెన్ వ్యవస్థలో ప్రజల భాగస్వామ్యానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామని, భోజనం చేసిన ప్రతి విద్యార్థి తల్లిదండ్రులకు ప్రతిరోజూ సాయంత్రం సందేశం పంపించి వారి అభిప్రాయాలను సేకరిస్తున్నామని తెలిపారు. తల్లిదండ్రుల నుంచి వచ్చే సూచనలు, అభిప్రాయాలను విశ్లేషించి అవసరమైన మార్పులు, మెరుగుదలలు చేపడుతున్నట్లు చెప్పారు.స్మార్ట్ కిచెన్లలో మహిళా సంఘాల సభ్యులు, కిచెన్ మేనేజర్లు, వంట నిర్వాహకులు, ఆహారాన్ని రవాణా చేసే వాహనాల డ్రైవర్లు, ప్రధానోపాధ్యాయులతో మాట్లాడిన కలెక్టర్, విద్యార్థులకు ఇంటి భోజనం మాదిరిగా రుచికరమైన, పౌష్టికాహారంతో కూడిన భోజనం అందేలా అత్యంత బాధ్యతతో పనిచేయాలని సూచించారు. మహిళా సంఘాల సమర్థ నిర్వహణ వల్లే స్మార్ట్ కిచెన్ వ్యవస్థ విజయవంతంగా కొనసాగుతోందని ప్రశంసించారు.ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన బోధనతో పాటు బూట్లు, దుస్తులు, పాఠ్యపుస్తకాలు, ఇతర సౌకర్యాలు ఇప్పటికే ప్రభుత్వం అందిస్తోందని, ఇప్పుడు స్మార్ట్ కిచెన్ల ద్వారా రుచికరమైన, పౌష్టికాహారంతో కూడిన పరిశుభ్రమైన మధ్యాహ్న భోజనాన్ని కూడా అందిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలను అన్ని విధాలా ఆదర్శ విద్యాసంస్థలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ పేర్కొన్నారు.**విద్యార్థులతో కలిసి భోజనం చేసిన కలెక్టర్** పులివెందులలో జెడ్పి బాలుర హై స్కూల్ లో.. స్మార్ట్ కిచెన్ భవనాల నిర్మాణం, ఆకర్షణీయమైన గోడ చిత్రాలు, ప్రదర్శన బోర్డులు, ఇతర మౌలిక సదుపాయాలను పరిశీలించిన అనంతరం.. బాలికల ప్రభుత్వ పాఠశాలలో.. విద్యార్థినులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న తీరును, వంట నిర్వాహకులు పాటిస్తున్న పరిశుభ్రత ప్రమాణాలను జిల్లా కలెక్టర్ ప్రత్యక్షంగా తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేసి, అన్నం, కూరలు, ఇతర ఆహార పదార్థాలను స్వయంగా రుచి చూసి వాటి నాణ్యతను పరిశీలించారు.విద్యార్థులతో మమేకమై “భోజనం ఎలా ఉంది? రుచిగా ఉందా? పరిశుభ్రంగా అందుతున్నదా?“ అని అడిగి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. దీనికి స్పందించిన విద్యార్థులు, “భోజనం చాలా రుచిగా ఉంది. గతంలో కంటే ఇప్పుడు మరింత నాణ్యంగా, పరిశుభ్రంగా అందుతోంది“ అని ఆనందం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో పులివెందుల ఆర్డీవో చిన్నయ్య, మున్సిపల్ కమిషనర్ తనూజ, డీఈవో శంశుద్దీన్, ఎస్ఎస్ఏ పివో అనురాధా, డీఆర్డీఏ పీడి రాజ్యలక్ష్మి, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ ఏడుకొండలు, పీఆర్ ఎస్ఈ మద్దన్న, ఏపీ సీఎన్ఎఫ్ డిపిఎం ప్రవీణ్ కుమార్, సంబంధిత శాఖల అధికారులు, మండల అభివృద్ధి అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు, కిచెన్ మేనేజర్లు, ఫుడ్ ట్రక్ డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

# కోమన్నూతల అరటికి ప్రపంచ మార్కెట్లో మరింత గుర్తింపు తీసుకురావాలి

**ఆధునిక సాగు, శాస్త్రీయ యాజమాన్యం, ఎఫ్‌పీఓల బలోపేతంతో రైతులు ముందుకు సాగాలి:జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి**



**కడప, రూరల్ మన జనప్రగతి జూలై 22:-** కోమన్నూతల అరటి సాగు నాణ్యత, ఉత్పత్తి, మార్కెటింగ్ పరంగా దేశానికే కాకుండా ప్రపంచ స్థాయిలో ఆదర్శంగా నిలిచేలా రైతులు, అధికారులు సమిష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. పులివెందుల నియోజకవర్గ పర్యటనలో భాగంగా బుధవారం జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి లింగాల మండలం కోమన్నూతల గ్రామాన్ని సందర్శించి, అక్కడ విస్తారంగా సాగవుతున్న అరటి తోటలను పరిశీలించారు. రైతులతో నేరుగా మాట్లాడి పంట సాగు, దిగుబడులు, మార్కెటింగ్, ఎగుమతి అవకాశాలు, ఎదురవుతున్న సవాళ్లపై సమగ్రంగా చర్చించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. దేశంలోనే విశిష్ట గుర్తింపు పొందిన కోమన్నూతల అరటి పంట జిల్లాకు గర్వకారణమని అన్నారు. ఉద్యాన పంటల అభివృద్ధిలో ఈ గ్రామం ప్రత్యేక స్థానాన్ని సంపాదించిందని, జిల్లాతో పాటు రాష్ట్ర స్థూల విలువ ఆధారిత ఉత్పత్తి (జీవీఏ)లో అరటి సాగు కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు.లింగాల మండలంలోని కోమన్నూతల గ్రామంలో సుమారు 1,800 మంది రైతులు 3,600 ఎకరాల్లో అరటి సాగు చేస్తున్నారని తెలిపారు. ఇక్కడ పండే అరటికి దేశీయ మార్కెట్‌తో పాటు విదేశీ మార్కెట్లలో కూడా మంచి ఆదరణ ఉందని, ఆ అవకాశాలను మరింత విస్తరించే దిశగా అధికారులు కార్యాచరణ రూపొందించాలని సూచించారు.అరటి పంటకు విలువ ఆధారిత ఉత్పత్తులు, శీతల గిడ్డంగులు, నాణ్యమైన ప్యాకేజింగ్, రవాణా, మార్కెటింగ్ సదుపాయాలు మరింత మెరుగుపడితే రైతులకు అధిక ఆదాయం లభిస్తుందని చెప్పారు. రైతులకు మార్కెట్ ధోరణులు, నాణ్యత ప్రమాణాలు, ఎగుమతి విధానాలపై నిరంతరం అవగాహన కల్పించాలని ఉద్యానశాఖ అధికారులను ఆదేశించారు.పంట సాగులో శాస్త్రీయ యాజమాన్యాన్ని పాటించడం అత్యంత అవసరమని కలెక్టర్ పేర్కొన్నారు. నేల పరీక్షల ఆధారంగా ఎరువుల వినియోగం, సమతుల్య పోషక నిర్వహణ, అవసరానికి అనుగుణంగా పురుగుమందుల వినియోగం, పంట సంరక్షణ చర్యలు చేపట్టాలని రైతులకు సూచించారు. సూక్ష్మ నీటి పారుదల పద్ధతులను విస్తృతంగా అమలు చేయడం ద్వారా నీటి వినియోగం తగ్గి దిగుబడులు పెరుగుతాయని వివరించారు.వ్యవసాయ యాంత్రీకరణ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, నూతన సాగు విధానాలను రైతులు అలవర్చుకోవాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడం ద్వారా ఉత్పత్తి వ్యయం తగ్గి, నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని తెలిపారు.రైతులు వ్యక్తిగతంగా పంటను విక్రయించే విధానానికి బదులుగా సంఘటితంగా పనిచేస్తే మార్కెట్లో మరింత బలమైన స్థానం సాధించగలరని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. రైతులందరూ తప్పనిసరిగా “రైతు ఉత్పత్తిదారుల సంస్థలు“ (ఎఫ్‌పీఓలు)లో సభ్యులుగా చేరి సమిష్టిగా వ్యవహరించాలని సూచించారు. ఎఫ్‌పీఓల ద్వారా రైతులు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు తక్కువ ధరలకు సమకూర్చుకోవడంతో పాటు, పంటను ఒకే వేదికపై పెద్ద మొత్తంలో విక్రయించే అవకాశం లభిస్తుందని తెలిపారు. దీంతో మధ్యవర్తులపై ఆధారపడాల్సిన అవసరం తగ్గి, రైతులకు గిట్టుబాటు ధరలు లభించే అవకాశాలు మెరుగుపడతాయని చెప్పారు.ప్రస్తుతం దేశంలోనే అత్యంత విజయవంతంగా కొనసాగుతున్న మహారాష్ట్ర రాష్ట్రంలోని నాసిక్‌కు చెందిన “సహ్యాద్రి ఫార్మ్స్ ఎఫ్‌పీఓ“ రైతుల సంఘటిత శక్తికి గొప్ప నిదర్శనమని కలెక్టర్ పేర్కొన్నారు. వేలాది మంది రైతులను ఒకే వేదికపైకి తీసుకువచ్చిన సహ్యాద్రి ఎఫ్‌పీఓ, నాణ్యమైన ఉత్పత్తులను దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లకు ఎగుమతి చేస్తూ రైతుల ఆదాయాన్ని గణనీయంగా పెంచిందని తెలిపారు. కోమన్నూతల అరటి రైతులు కూడా అదే తరహాలో సంఘటితంగా ముందుకు వచ్చి బలమైన ఎఫ్‌పీఓలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎఫ్‌పీఓల ద్వారా పంట మార్కెటింగ్, శాస్త్రీయ గ్రేడింగ్, నాణ్యమైన ప్యాకేజింగ్, శీతల నిల్వ సదుపాయాల వినియోగం, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ, దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లతో ప్రత్యక్ష అనుసంధానం వంటి అంశాల్లో పురోగతి సాధించవచ్చని వివరించారు. ఈ విధంగా రైతులు ఉత్పత్తిదారులుగానే కాకుండా వ్యాపారవేత్తలుగా ఎదిగి, కోమన్నూతల అరటికి ప్రపంచ మార్కెట్లో మరింత ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. జిల్లా ఉద్యానశాఖ అధికారి హరిప్రసాద్, ఉద్యానశాఖ సహాయ సంచాలకుడు రవిచంద్ర, ఎపిఎంఐపీ, సంబంధిత వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# సామూహిక రిలే నిరాహార దీక్షలకు మద్దతు తెలిపిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు.




**జీవో ఎంఎస్ నెం.396ను రద్దు చేయాలి**

**ప్రజల ఆస్తులకు పూర్తి భద్రత కల్పించాలి.**

**కడప మన జనప్రగతి జూలై 22:-**నగరంలోని ఐటీఐ సర్కిల్ సమీపంలోని బాలాజీ నగర్ సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దస్తావేజుల లేఖదారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సామూహిక రిలే నిరాహార దీక్షలకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సంఘీభావం తెలిపారు.ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పి. రవీంద్రనాథ్ రెడ్డి , మాజీ డిప్యూటీ సీఎం ఎస్.బి.అంజాద్ భాషా , మాజీ మేయర్, కే. సురేష్ బాబు పాల్గొని దీక్షా శిబిరాన్ని సందర్శించి తమ మద్దతు ప్రకటించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జీవో ఎంఎస్ నెం. 396ను తక్షణమే రద్దు చేయాలని, ప్రజల ఆస్తులకు సంపూర్ణ భద్రత కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.దశాబ్దాలుగా ప్రజలకు సేవలందిస్తున్న దస్తావేజుల లేఖదారుల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం బాధాకరమన్నారు. ప్రజల ఆస్తి హక్కులను కాపాడే విధానాలే అమలు కావాలని, ప్రజల్లో అయోమయం, అసౌకర్యం కలిగించే నిర్ణయాలను ప్రభుత్వం వెంటనే పునఃసమీక్షించాలని కోరారు.ప్రజల హక్కులు, ఆస్తుల భద్రత విషయంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలుస్తుందని, న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చేపట్టే ప్రతి ప్రజా ఉద్యమానికి తమ పూర్తి మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు.దస్తావేదుల లేఖరుల జిల్లా సంక్షేమ సంఘం అధ్యక్షుడు గుంటి వేణుగోపాల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన విధానాలు ప్రభుత్వ సేవలను క్రమంగా ప్రైవేటీకరణ వైపు నెడుతున్నాయని విమర్శించారు.ప్రజల ఆస్తులు, ప్రభుత్వ సేవలను బడా బాబుల చేతుల్లోకి అప్పగించే ప్రయత్నమే జీవో ఎంఎస్ నెం. 396 వెనుక ఉన్న అసలు ఉద్దేశమని ఆరోపించారు. ప్రజా ప్రయోజనాల కంటే కొందరి ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇస్తూ కూటమి ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటోందని విమర్శించారు.ప్రజల ఆస్తుల భద్రతకు భంగం కలిగించే ఎలాంటి నిర్ణయాన్నీ ప్రజలు అంగీకరించరని, ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్షంగా వ్యవహరించడం సరైన విధానం కాదన్నారు.ఈ అంశంపై ప్రజలకు స్పష్టమైన సమాధానం చెప్పాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉందని, ప్రజల ప్రయోజనాలకు విరుద్ధంగా తీసుకుంటున్న నిర్ణయాలపై కూటమి నాయకులను ప్రజలు నిలదీయాలని పిలుపునిచ్చారు.ప్రజల హక్కులు, ప్రభుత్వ వ్యవస్థల పరిరక్షణ కోసం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రజలతో కలిసి నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి, పులి సునీల్ కుమార్, వెల్లాల రామకృష్ణారెడ్డి. షఫీ, దాసరి శివప్రసాద్ తోటా కృష్ణ రమేష్ రెడ్డి.పెద్దిరెడ్డి రామ్మోహన్ రెడ్డి, నాగార్జున రెడ్డి .గుంటి నాగేంద్ర. ఇబ్రహీం మియా,సుబ్బారెడ్డి, లేఖర్ల సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఫ్లో సైటోమెట్రీ శిక్షణతో ఆధునిక పరిశోధనలకు కొత్త దిశ

**● క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించడంలో కీలక సాంకేతికత:**

**● వైవీయూ వీసీ ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్**



**కడప మన జనప్రగతి జూలై 22:-**ఫ్లో సైటోమెట్రీ ఆధునిక వైద్య, జీవశాస్త్ర పరిశోధనల్లో అత్యంత కీలకమైన సాంకేతికతగా నిలుస్తోందని యోగి వేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్ అన్నారు. ఈ సాంకేతికత ద్వారా క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించడం, క్యాన్సర్ కణాల విశ్లేషణ, చికిత్స ఫలితాల అంచనా సాధ్యమవుతాయని పేర్కొన్నారు.వైవీయూ జెనెటిక్స్ అండ్ జెనోమిక్స్ విభాగం ఆధ్వర్యంలో, ఏఎన్ఆర్ఎఫ్‌పెయిర్ ప్రాజెక్టు, బీడీ లైఫ్ సైన్సెస్ ఇండియా సహకారంతో నిర్వహిస్తున్న రెండు రోజుల జాతీయ స్థాయి ఫ్లో సైటోమెట్రీ వర్క్‌షాప్ బుధవారం ప్రారంభమైం ది. వీసీ ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి. పద్మ, ఏఎన్ఆర్ఎఫ్‌పె యిర్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఎల్. సుబ్రహ్మణ్య శర్మ పాల్గొన్నారు. కన్వీనర్ ప్రొఫెసర్ ఎల్. దాక్షాయణి అధ్యక్షత వహించారు.విద్యార్థులు, పరిశోధకులు ఇటువంటి శిక్షణా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని ఆధునిక సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని వీసీ సూచించారు.ప్రొఫెసర్ ఎల్. సుబ్రహ్మణ్య శర్మ మాట్లాడుతూ ఆధునిక పరిశోధనలకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడమే వర్క్‌షాప్ ప్రధాన లక్ష్యమని తెలిపారు.కన్వీనర్ ప్రొఫెసర్ ఎల్. దాక్షాయణి మాట్లాడుతూ ఫ్లో సైటోమెట్రీ ద్వారా క్యాన్సర్, రోగనిరోధక వ్యవస్థ, హెచ్ఐవీ/ఎయిడ్స్ సంబంధిత కణాలను వేగంగా, ఖచ్చితంగా విశ్లేషించవచ్చని వివరించారు.రిసోర్స్ పర్సన్ డా. కరుణ కుమార్ కొండవీటి ఫ్లో సైటోమెట్రీ ప్రాథమిక సూత్రాలు, క్యాన్సర్ పరిశోధనల్లో దీని వినియోగంపై వివరించారు. అనంతరం అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులకు ప్రత్యక్ష ప్రాయోగిక శిక్షణ అందించారు.

PRINTER, PUBLISHER AND OWNED BY **YADATI VIVEKANANDA REDDY YADAV**, AND PRINTED AT M/S GOKUL PUBLICATIONS, # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), PUBLISHED AT # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), Editor : YADATI VIVEKANANDA REDDY YADAV, E-Mail :manajanapragathi@gmail.com, Cell : 8125555507 RNI No : - APTEL/2021/80174